మహబూబ్‌నగర్
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



# సొంత ఖర్చులతో రోడ్డు పనులు



**నారాయణపేట ప్రతినిధి, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** మక్తల్ మండలంలోని మంతన్‌గోడు గ్రామానికి నాలుగున్నర కిమీ రోడ్డును రూ.5లక్షల ఖర్చుతో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు జలంధర్ రెడ్డి తన సొంత ఖర్చులతో మట్టి రోడ్డును వేశారు. నారాయణపేట జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సొంత గ్రామమైన మంతన్ గౌడ్ గ్రామానికి జాతీయ రహదారి నుండి బొందల కుంట గ్రామం నుండి చేరుకోవడానికి దగ్గరి దారి గతం నుండి మంతనోడు గ్రామానికి పిల్లబాట గా ఉన్న దీన్ని రోడ్డు వేయాలని గ్రామానికి చెందిన అఖిలపక్ష నాయకులు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా మంత్రి హామీ ఇచ్చిన సంవత్సరం గడుస్తున్న కార్యరూపం దాల్చకపోవడంతో గ్రామస్థులు విసుకు చెందారు. ఇటీవల బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ పాదయాత్రలో రోడ్డు విషయాని ఆయన దృష్టికి తీసుకెళ్ల ఆ పని చూడాలని జలంధర్ రెడ్డి కి ఆదేశించారు. గత వారం రోజులుగా మంతన్గోడు గ్రామం నుండి బందల్‌కుంట గ్రామ శివారు వరకు దాదాపు 5కిమీ ల మట్టి రోడ్డు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదిరెడ్డి జలంధర్ రెడ్డి తనఖ ర్చులతో రోడ్డు వేయడం జరిగింది. ఇందుకు గ్రామ ప్రజలు బీజేపీ కార్యకర్తలు, అఖిలపక్ష నాయ కులు జలంధర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# రాహుల్‌గాంధీని కలసిన మధుసూధన్‌రెడ్డి

**దేవరకద్ర, అక్టోబరు 30, ప్రభాతవార్త :** కాంగ్రేస్ పార్టీ అగ్రనేత రాహు ల్‌గాంధీని ఆదివారం జడ్చర్లలో టీపీసీసీ కార్యదర్శి జి. మధుసూ ధన్‌రెడ్డి కలిశారు. భారత్‌జో డో యాత్ర సందర్భంగా ఆయ నను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేవరకద్ర నియో జక వర్గంలో కాంగ్రేస్ పా ర్టీ పరిస్థితిని మధు సూద న్‌రెడ్డి రాహుల్ గాంధీకి వివరించారు. దేవరకద్ర ని యోజకవర్గం గూండా భారత్‌జో డోయాత్ర చేపట్టినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



రాహుల్‌గాంధీతో మధుసూధన్‌రెడ్డి

# వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలం

**వనపర్తి రూరల్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** వనపర్తి మండల పరిధిలోని చీమనగుంటపల్లి గ్రామంలో వనపర్తి జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా రైతు సంఘం కార్య దర్శి పరమేశ్వరాచారి వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు వరి కొను గోలు కేంద్రం దగ్గర సుమారు 50 మంది రైతులు వరిధాన్యాన్ని కొనుగో లు కేంద్రానికి తీసుకురావడం జరిగింది. ఈ సందర్భంగా పరమేశ్వ రాచారి మాట్లాడుతూ ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాన్ని తక్షణమే ఏర్పాటు చేసి రైతుల దగ్గర నుండి సకాలంలో వరి కొనుగోలు చేయాలని కోరారు. అదే విధంగా సింగిల్‌విండో వెంకట్రావు దగ్గర ఫోన్ లో మాట్లాడారు 2వ తేదీ నుండి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చైర్మెన్ చెప్పారని ఆయన తెలిపారు. అదే విధంగా రైతులకు కవర్లు ఏర్పాటు చేయాలని వరి కొనుగోలు కేంద్రాల దగ్గర నీటి వసతి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు బాలపీరు, కరుణాకర్, కృష్ణయ్య, శివలీల, రామస్వామి, వెంకటేష్, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.



వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వరాచారి

# భవన నిర్మాణ కార్మిక చట్టాల రక్షణకోసం పోరాడుదాం

**పెబ్బేరు, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** పెబ్బేరు భవన నిర్మాణ కార్మిక చట్టాల రక్షణకై పోరాడుదామని సీఐటీయు వనపర్తి జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ పిలుపునిచ్చారు. ఆదివారం పెబ్బేరు మండలంలోని రంగాపురం, గుమ్మడం, అయ్యవారిపల్లి, సూగూరు, బునాదిపూరం గ్రామాల్లో భవన నిర్మాణ తాపీ మేస్త్రీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబర్ 31 తేదీన వనపర్తి జిల్లా కేంద్రంలో సీఐటీయు కార్యాలయం దగ్గర భవన నిర్మాణ ఇతర కార్మిక రంగాల జిల్లా 3వ మహాసభ జరుగుతుంది. ఈ సభలకు భవ నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగూరు రాములు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటం రాజు పాల్గొంటారని వారు చెప్పారు. మేస్త్రీ అందరు అధిక సంఖ్యలో పాల్గొని మా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాంతన్న, నాగేష్, రాములు, గోవిందు, సురేష్, రమేష్, కృష్ణయ్య, అలివేల, మంగమ్మ, మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



మహాసభ గోడపత్రిక విడుదల చేస్తున్న నాయకులు

# వికలాంగుల రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ గౌడ్‌ను సన్మానించిన రాహుల్ గాంధీ

**మక్తల్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ పట్టణ కేంద్రంలో శనివారం మధ్యాహ్నం వికలాంగుల రాజ్యాధికార ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బిజ్వార్ నగేష్ గౌడ్ అండ్ టీమ్ రాహుల్ గాంధీని ప్రత్యేకంగా కలిశారు. రాహుల్ గాంధీ కి వికలాంగుల సమస్యలపై వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ వినతి పత్రంలో వికలాంగులకు 5% రాజకీయ రిజర్వేషన్ 2016 వికలాంగుల హక్కుల చట్టం పూర్తి అమలు కావాలని, వికలాంగులకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలనే అంశం పై రాహుల్ గాంధీ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ వినతిపత్రాన్ని రాఘుల్ గాంధీక్షుణ్ణంగా చదివి భవిష్యత్ లో వికలాంగుల సమస్యలు తప్పకుండా పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. వికలాంగుల పట్ల కాంగ్రెస్ పార్టీ అపారమైన అభిమానం ఉందని రాహుల్ గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతయ్య, ఆంజనేయులు, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



రాహుల్ గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న నగేష్‌గౌడ్

# శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి ఉద్దాలు, అలంకరణ మహోత్సవానికి హాజరైన ప్రజాప్రతినిధులు

**వనపర్తి ప్రతినిధి (మదనాపురం), అక్టోబర్ 30 ప్రభాతవార్త :** మదనాపురం మండలం కొత్తపల్లి గ్రామం నుండి ప్రారంభమై శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి అలంకరణ, ఉద్దాల మహోత్సవ కార్యక్రమానికి మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా జడ్పీ చైర్మెన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, వనపర్తి జడ్పీ చైర్మెన్ లోక్‌నాథ్ రెడ్డి, చిన్నచింతకుంట జడ్పీటీసీ రాజేశ్వరి, మదనాపురం ఎంపీపీ పాలకవర్గ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారి ఉద్దాలకు పూజలు చేస్తున్న ప్రజాప్రతినిధులు

**చిన్నచింతకుంట :** కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం శ్రీదేవి, భూదేవి సమ్మేకుడైన శ్రీ కురుమూర్తి స్వామి అశ్వహనుమద్వాహన సేవలపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. కొండపై కల స్వామి వారి ప్రధానాలయంలో అందమైన పూలతో అలంకరించి పల్లకిలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఉంచి వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ కులస్థులు స్వామి వారి పల్లకిని కొండపై నుంచి దిగువ ఉన్న ముఖద్వారం వరకు పల్లకి సేవ కొనసాగింది. ఈ సేవలో ఎంపీపీ హార్షవర్ధన్ రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి, ఈఓ శ్యాంసుందరాచారి, ప్రజా ప్రతినిధులు, మాజీ పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# బోయిన్‌పల్లిలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**కంటోన్మెంట్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** తమకు విద్యా బుద్దులు నేర్పిన ఉపాధ్యాయులను జీవితంలో ఎప్పుడు మర్చిపోకూడదని కం టోన్మెంట్ బోర్డు మాజీ ఉ పాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. కంటోన్మెంట్ న్యూ బోయిన్‌పల్లిలోని ప్రభుత్వ పా ఠశాలలో విద్యనభ్యసించిన 1989-90 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా జంపన మా ట్లాడుతూ విద్యాబోధన ద్వారా తాము సమాజంలో ఉన్నత స్థానాల్లో ఉన్నామని అభిప్రాయాలను వెల్లడించారు. అప్పటి విద్యా దశలో జ్ఞాపకాలను, బాల్య స్మృ తులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులకు, పూర్వ విద్యార్థులకు జంప న ప్రతాప్ చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు.

# కొనసాగుతున్న కురుమూర్తి బ్రహ్మోత్సవాలు



స్వామి వారి ఆభరణాలను మోసుకెళ్తున్న దృశ్యం

## - స్వామి వారి ఆభరణాలకు ముక్కెర వంశీయుల పూజలు
## - పోలీసుబందోబస్తు మధ్య కొండకు చేరిన ఆభరణాలు
## - అశ్వ వాహనంపై విహరించిన కురుమూర్తి రాయుడు

**చిన్నచింతకుంట, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** చిన్న చింతకుంట భక్తుల ఇరవేల్పుగా కురుమతి గిరిలో శ్రీ వెంకటేశ్వరుని ప్రతి రూపంగా కొలవబడుతున్న శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం శ్రీ కురుమూర్తి స్వామి వారి అలంకరణ ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వనపర్తి జిల్లా ఆత్మకూరు లోని ఎస్‌బీహెచ్ లో ప్రత్యేక లాకర్ లో భద్రపరిచిన స్వామి వారి ఆభరణాలకు ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రజా ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పట్టణానికి చెందిన స్వర్ణకారులైన గాడి వంశీయులు స్వామి వారి ఆభరణాల పెట్టెను తలపై ఉంచుకొని ఊరేగింపుగా పరమేశ్వర స్వామి చెరువు కట్ట మీదకి చేర్చారు. ముక్కెన వంశపు సంస్థానా దీశులు స్వామి వారి ఆభరణాలకు ప్రత్యేకంగా సమకూర్చిన వాహనంలో మదనాపూర్ మండలం కొత్తపల్లి, దుప్పల్లి గ్రామా మీదుగా మండలంలోని అమ్మాపూర్ గ్రామానికి చేరుకొని ముక్కెర వంశపు సంస్థాన దీశులు రాజా సోంభూపాల్ స్వగృ హానికి చేరుకోగానే రాజా శ్రీరాం భూపాల్ స్వాగతం పలికి స్వామి వారి ఆభరణాలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముక్కెర వంశానికి చెందిన రాజారాం భూపాల్‌తో పాటు డీపీఓ వెంకటేశ్వర్లు, ఆర్‌డీఓ అనిల్ కుమార్, ఎంపీపీ హార్షవ ర్ధన్ రెడ్డి, తహసిల్దార్ సువర్ణ రాజు, ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, ఆలయ ఈఓ శ్యామ్ సుందరాచారి, దేవస్థాన మాజీ చైర్మెన్ శ్రీని వాస్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, నాయ కులు కాటం ప్రదీప్ కుమార్ గౌడ్, కొండా ప్రశాంత్ రెడ్డిలు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన బంబి వంశీయులు స్వామి వారి ఆభరణాలను కాలినడకన కురుమూర్తి కొండకు స్వామి వారి ఆభరణాలను చేర్చారు. అక్కడ దేవస్థానం అధికారులు, ప్రజాప్రతినిధులు భద్రపరచిన ఆభరణా ల పెట్టెను తెరచి ఒక్కోటిగా లెక్కించి ఆభరణాల వివరాలను నమోదు చేసుకొని ఆలయ ప్రధాన అర్చకులు వెంకటేశ్వర చార్యులకు అప్పచెప్పారు. శ్రీకురుమూర్తి స్వామి లక్ష్మీదేవి అమ్మవారి లకు మణిమాణిక్యాలు, వజ్ర వైడ్యుర్యాలు, పచ్చ లు పొదిగిన రత్నాలు, వజ్రపు రాళ్లు, శంకు చక్రాలు, భుజకిరీటాలు, మొలగజ్జెలు, మకరకుందనాలు తో బంగారు ఆభరణాలను అలంకరించడంతో శ్రీ కురుమూర్తి స్వామి కొలువైన కాంచన గృహ స్వర్ణకాంతులతో పులకరించింది. స్వామి ఆభరణాలు ఊరేగింపుకు సీఐ రజిత రెడ్డి ఆధ్వ ర్యంలో బందోబస్తు నిర్వహించారు. అనంతరం స్థానిక ఎ మ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సువర్ణ బూచితుడైన శ్రీ కురు మూర్తి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించా రు. అమ్మపూర్, గూడూరు సర్పంచులు సులోచన కాంతా రావు, మాజీ పాలకమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

# మునుగోడులో ఎమ్మెల్యే ఆల ప్రచారం



ఉపఎన్నికల్లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆల

**దేవరకద్ర, అక్టోబరు 30, ప్రభాతవార్త :** మునుగోడు ఉపఎన్నికల్లో ఆదివారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ముమ్మరంగా ప్రచారం చేశారు. గత కొన్ని రోజులుగా ఎమ్మెల్యే ఆల మునుగోడు ఉప ఎన్నికల్లో ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగానే అక్కడి టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విజయాన్ని కా ంక్షిస్తు మునుగోడు నియోజకవర్గంలోని మర్రిగూడ, శివన్నగూడెం తదితర గ్రామాలలో ఆయన పర్యటించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమపథకాలను ప్రజలకు ఎమ్మెల్యే ఆల వివరించారు. ముందు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోవడమే కాకుండా చేస్తున్న ప్రజాసంక్షేమపథకాలను చూసి టీఆర్ఎస్ అభ్యర్థిని అత్యధికంగా ఓట్లువేసి గెలిపించాలని ఎమ్మెల్యే ఆల అక్కడి ఓటర్లకు కోరారు. ఈ కార్యక్రమంలో అక్కడి టీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.



మన్యంకొండలో తిరుచ్చిసేవ నిర్వహిస్తున్న పురోహితులు

# మన్యంకొండలో ఘనంగా స్వామివారి తిరుచ్చిసేవ

**దేవరకద్ర, అక్టోబరు 30, ప్రభాతవార్త :** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న రథ మండపం వరకు ఈ సేవ నిర్వహించారు. పురోహితుల వేదమంత్రాలు, భక్తుల హరినామస్మరణ, కాగడాల వెలుతురులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి వారిని మళ్ళి గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. అనంతరం పూజలు, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

**మన్యంకొండలో ఊరేగింపు :** మన్యంకొండలో తిరుచ్చిసేవ సందర్భంగా స్వామి వారు తిరుచ్చిసేవ పై ఊరేగుతూ అలంకరణలో భక్త కోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలు, బంగారు ఆభరణాలతో స్వామివారిని అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ పురేందర్‌కుమార్, ప్రధాన పూజారులు రాజేశ్, నరసింహ్మాయ్య, పాలకమండలి సభ్యులు, పర్యవేక్షకుడు నిత్యానందచారి, సిబ్బంది సుదర్శన్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలిపారు.

# మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి



**మక్తల్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** మెగా రక్తదాన శిబిరాన్ని నేడు ఉదయం 9గంటలకుమక్తల్ పోలీస్ స్టేషన్‌లో పోలీసు అమరవీరుల దినోత్స వాన్ని పురస్కరించుకొని మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతుందని మక్తల్ సీఐ సీతయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారాయణపేట జిల్లా ఎస్పీ, ఎమ్మెల్యే హాజరవుతాకని ఆయన తెలిపారు. కావున మక్తల్ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ లు, యువకులు అధిక సంఖ్యలో హాజరై మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# దేశానికే ఆదర్శం తెలంగాణ సంక్షేమ పథకాలు

## - రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు యావత్ దే శానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి నియోజకవర్గంలోని రేవల్లి, గోపాల్‌పేట, శ్రీరంగాపూర్, పెబ్బేరు, పెద్ద మందడి, ఖిల్లాఘణపురం మండలాలకు చెంది న 259 మంది లబ్దిదారులకు మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జిల్లా కేంద్రం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డలకు ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా నిలిచారని పేదల బ్రతుకుల్లో బాధలు చూసి తెలంగాణ ప్రభుత్వం ఆడబిడ్డల పెళ్లిల్లకు కళ్యాణలక్ష్మీ పథకం ద్వారా రూ.1లక్ష116 నగదును అందజేస్తుందని ఆయన గుర్తు చేశారు. గర్భిణీ స్త్రీలకు అమ్మ ఒడి పథకం కింద పౌష్టికాహారం అందజేయడంతో పాలు కాన్పు అయిన మహిళలకు కేసీఆర్ కిట్ ద్వారా ఆడబిడ్డ పుడితే రూ.13వేలు, మగబిడ్డ పుడితే రూ.12వేల ఆర్థిక సాయం అందజేయడం జరుగుతుందని అన్నారు. వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, వృత్తి కార్మికులు, వితంతువు మహిళలకు రూ.2,116 లు, రూ.3,116 ఆసరా పెన్షన్ల ను ఇవ్వడం జరుగుతుందని అన్నారు. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించేందుకు రైతు బంధు పథకం ద్వారా ఎకరాకు ఏడాదికి రూ.10వేలు పంట పెట్టుబడి ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ప్రమాదవశా త్తు, మరే ఇతర కారణాల చేతనైనా రైతు మరణించినట్లయితే రైతు భీమా కింద తక్షణమే రూ.5లక్షల పరిహారం చెల్లించడం జరుగుతుందని అన్నారు. వ్యవసాయాన్ని పండగ చేసేందుకు మిషన్ కాకతీయ ద్వారా చెరువులు కుంటలకు మరమ్మత్తులు చేయించడం జరిగిందని అన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి సురక్షిత త్రాగునీరే సరఫరా చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. గొల్ల కురుమల ఆర్థిక అభివృద్ధి కోసమే సబ్సిడీ ద్వారా గొర్రెపిల్లలను పంపిణీ చేస్తునాన్నమని మత్స్యకారుల అభివృద్ధి కోసం ఉచితంగా చేప పిల్లల పంపిణీ, దళితుల ఆర్థిక స్వావలంబన కోసం దళిత బంధు పథకాలను అమలు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పల్లెప్రగతి, పట్టణ ప్రగతి ద్వారా గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా వెలుగొందుతున్నాయని, హరితహారం పథకం దేశానికే దిక్సూచి అని మంత్రి కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ గట్టు యాదవ్, కౌన్సిలర్లు బండారు కృష్ణ, తదితరులు ఉన్నారు.



# వరి కోతలు మొదలాయే కొనడం లేదా...?



రోడ్డుపై వరిధాన్యం ఆరబోసిన రైతులు

**నారాయణపేట ప్రతినిధి, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** మక్తల్ నియోజకవర్గ పరిధిలో ప్రాజెక్టుల కింద వరి కోతలు మొదలై వారం రోజులు గడుస్తున్న ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నఆరు. దీన్ని ఆసరాగా తీసుకొని కొందరు దళారులు ఏకంగా కల్లాల దగ్గరకు వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తూ కమిషన్, తరుగు పేరున రైతులను దోచుకుంటున్నారని రైతులు అంటున్నారు. తమది రైతు ప్రభుత్వం, రైతు క్షేమమే తమ ధ్యేయమని తెరాస ప్రభుత్వం అంటున్న అకాల వర్షాలకు తట్టుకొని పంటలు చేతికొచ్చి అమ్ముకునే దశలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో తాము దళారులను ఆశ్రయించాల్సి వస్తుందని తమ పరిస్థితి ఆగమ్య గోచరంగా మరిందని రైతులు అంటున్నారు. ధాన్యం కోతలు పడే సమయానికి దాన్ని అమ్ముకోవడానికి రైతులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తానని ఎందుకు మద్దతు ప్రకటించింది. త్వరలోనే ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి చెప్పిన ఆచరణలో ఎక్కడా అమలు కావడం లేదని రైతులు అంటున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారుల కొనుగోలు దందా మొదలుపెట్టారు. రైతుల నుంచి రైస్ మిల్లర్లలో దళారులను దింపి కొనుగోలు ప్రారంభించారు. ఇంత జరుగుతున్నప్పటికీ సొసైటీలు, సహకార సంఘాలు, మార్కెట్ యార్డ్‌లో ధాన్యం సేకరణ ఆలస్యం చేస్తున్నారు. ఇటీవల కురిసన వర్షాలకు తట్టుకొని పంట చేతికొచ్చి ధాన్యం కోతలు చేసి ధాన్యాన్ని ఆరబోసి కల్లాల దగ్గరికి దళారులు చేరి ధాన్యం తూకాలు పెడుతున్నారు. తడిసిన ధాన్యం ఉన్నందున క్వింటాలుకు 7కిలోల వరకు తరుగు తీస్తూ నగదు చెల్లింపులు నూటికి రెండు రూపాయల చొప్పున కమీషన్ తీసుకొని దళారులు లబ్ది పొందుతున్నారని తమను నిలువు దోపిడి చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరీఫ్ కాలంలో రెండు నెలలుగా అడపదపగా కురుస్తున్న అకాల వర్షాలకు తట్టుకొని వరిసాగు చేసిన రైతులు వరి పంటను చేతి కొచ్చిన ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు పెట్టకపోవడంతో విధిలేక కొంత మంది రైతులు నష్టమైన దళారులకే అమ్మి పెట్టుబడి బాకీలు తీర్చుకుంటున్నామని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకునే దిశగా చర్యలు తీసుకొని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఏ గ్రేడ్ రూ. 2060, బి గ్రేడ్ రూజ2040 మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాలను తెరిచి రైతులు పండించిన పంటను ఖరీదు చేయాలని అఖిలపక్షం నాయకులు కోరుతున్నారు.

# పనిచేసిన జ్ఞాపకాలు ఎంతో గొప్పవి




సీనియర్ ప్రొఫెసర్ జాడి ముసలయ్యను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు, ప్రొఫెసర్లు

తార్నాక, అక్టోబర్ 30 ప్రభాతవార్త: ఉస్మానియా యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ జాడి ముసలయ్య ఎందరికో మార్గదర్శకులని పలువురు విద్యార్థులు, ప్రొఫెసర్లు కొనియాడారు. ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ సెమినార్ హాల్లో విద్యార్థులు, రిసర్స్ స్కాలర్స్, పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ల ఆద్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ హెడ్ సీనియర్ ప్రొఫెసర్ జాడి ముసలయ్య పదవి విరమణ సన్మానసభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు, ప్రొపెసర్లు మాట్లాడుతూ విధినిర్వాహణలో అంకితభావంతో పనిచేసిన ప్రొ.జాడి ముసలయ్య ఉత్తమంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ముసలయ్యకు పలువురు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రొ. ముసలయ్య మాట్లాడుతూ ఓ.యూలో 31 సంవత్సరాలు విధ్యార్థులు, ప్రొఫెసర్ల మధ్య పనిచేసిన జ్ఞాపకాలు ఎంతో గొప్పవని తాను ఇక్కడ పనిచేయడం గర్వంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ఎంతో మంది నిరుపేద విద్యార్థులను ప్రొత్సహించానని చెప్పారు. తనకు పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చిన ఒయూ ఎంతో మధురమైన జ్ఞాపకాలను మిగిలించిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు చెన్నబసవయ్య, అడప సత్యనారాయణ, ముత్తయ్య, శ్రీనివాసులు పూర్వవిద్యార్థులు వీరు యాదవ్, బొమ్మ హన్మంతరావు, విజయ్, ఇంద్రకరన్‌రెడ్డి, ఎస్సై సతీష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# భారత్ జోడో యాత్రకు ప్రజలు పెద్దఎత్తున తరలి రావాలి



విలేకర్ల సమావేశంలో పాల్గొన్న టిపీసిసి కార్యదర్శి మసీబుల్లా షరీఫ్,కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అస్లాం తదితరులు

చార్మినార్, అక్టోబరు 30 ప్రభాతవార్త : ఏఐసీసీ అగ్రనేత రాహుల్ చేపట్టిన భారత్ జోడో యాత్రలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని టిపీసీసీ కార్యదర్శి మసీబుల్లా షరీఫ్ కోరారు. పాతబస్తీలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జోడో యాత్ర నవంబరు నెల ఒకటివ తేదీ మంగళవారం హసన్‌నగర్,తాడ్‌బన్ మీదుగా చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందని, మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు పురానాపూల్ గుడ్‌విల్ హోటల్ నుంచి భారత్ జోడో యాత్ర ప్రారంభమై మూసాబౌలి,లాడ్‌బజార్ మీదుగా చార్మినార్‌కు చేరు కుంటుందని తెలిపారు. పాతబస్తీలోని అన్ని వర్గాల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి భారత్ జోడో యాత్రను విజయ వంతం చేయాలని ఆయన కోరారు. చార్మినార్ నుంచి భారత్ జోడో యాత్ర నెక్లెస్ రోడ్డుకు చేరుకుంటుందని ఆయన తెలిపారు. విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అస్లాంతో పాటు పలువురు పాల్గొన్నారు.

# మచ్చబొల్లారం మార్కెట్ వ్యాపారులకు అండగా ఉంటా: ఎమ్మెల్యే మైనంపల్లి



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అల్వాల్, అక్టోబరు 30 ప్రభాతవార్త: నాలుగు దశాబ్ధాలుగా వ్యాపారాలు చేసుకుంటున్న వారి దుకాణాలకు అడ్డంగా తాత్కాలిక ప్రహరీ ఏర్పాటుకు సంబంధించి నిర్మాణాలు చేపట్టడం సహించరానిదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు స్పష్టం చేశారు. ఇటీవల మార్కెట్‌లోని శాస్వత దుకాణాలను పూర్తిగా మూసి వేసే విధంగా కొందరు వ్యక్తులు నిర్మాణాలు చేపట్టడం జరిగింది. విషయాన్ని వ్యాపారులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆదివారం మార్కెట్‌ను సందర్శించిన ఆయన పోలీసు బందోబస్తు నడుమ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఆక్రమణలను ఎమ్మెల్యే కూల్చివేయించారు. సంవత్సరాలు కాలంగా సుమారు 50 మంది జీవనోపాది ఈ దుకాణాలు మీద ఆదారపడి ఉందని మైనంపల్లి వివరించారు. అద్దెలు సకాలంలో చెల్లిచండం జరుగుతోందన్నారు. భూయజమానులు అదే విధంగా వారి నుంచి అగ్రిమెంట్ పొందిన వారు న్యాయపరంగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు. వ్యాపారస్తులను భయబ్రాంతులకు గురి చేస్తే చట్టం పరంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గుండాగిరి చేయాలని చూస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తెలిపారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో అన్ని వర్గాలు ప్రజలకు తాను అండగా ఉంటానని వివరించారు. వ్యాపారస్తులను బెదిరించడం ఇతర కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే పోలీసులకు అదేశించారు. మార్కెట్ వ్యాపారస్తులు ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జితేందర్‌నాథ్ నేతలు సురేందర్‌రెడ్డి, అనీల్ కిషోర్, శ్రావణ్, బల్వంత్ రెడ్డి, రాజేందర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# సంఘవిద్రోహ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు

## ఎమ్మెల్యే ముఠాగోపాల్



ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించిన దృశ్యం

చిక్కడపల్లి, అక్టోబరు 30 ప్రభాతవార్త: సంఘవిద్రోహ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీప్పదని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హెచ్చరించారు. జవహర్‌నగర్ టిఆర్టీ గ్రౌండ్స్‌లో సంఘవిద్రోహ శక్తుల ఆగడాలను అరికట్టాలని కోరుతూ ఆదివారం జనహిత ఫ్రెండ్స్‌అసోసి యేషన్ ప్రతినిధులు శనివారం స్థానిక కార్పొరేటర్‌తో పాటు చిక్కడపల్లి పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎంహెచ్.మనోజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె.రవి, ఉపాధ్యక్షుడు ఎం.కృష్ణ, బి.మైకేల్, కార్యదర్శి సత్యం దోనేటి, కార్యవర్గసభ్యుడు శ్యామ్‌సుందర్, టిఆర్ఎస్ సీనియర్ పున్న రాజ్‌మోహన్, జిహెచ్ఎంసి విశ్రాంత ఉన్నతాధికారి రవిమన్యు తదితరుల బృందం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యేముఠాగోపాల్ వెంటనే చర్యలు తీసుకుని చట్టపరంగా చర్యలు తీసుకోవాలని చిక్కడపల్లి పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సంజయ్‌కుమార్‌ను ఆదేశించారు. వెంటనే అక్కడి ప్రజలకు శాంతియుతమైన వాతావరణం నెలికొల్పేలా చూడాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆనంద్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో భారత విప్లవకారుల

# కమ్యూనిస్టు పార్టీ విస్తరణ

చిక్కడపల్లి, అక్టోబరు 30 ప్రభాతవార్త: భారత విప్లవకారుల కమ్యునిస్ట్ పార్టీ తెలంగాణ కార్యనిర్వాహక కమిటీ సమావేశం ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగింది. ఈసందర్భంగా జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యులు మెహర్ బెన్, మయూర్ తదితరులు హాజరైన తెలంగాణ రాష్ట్ర నూతన కమిటీని ఏర్పాటు చేశారు. రాష్ట్ర కార్యదర్శిగా వెలిజాల బసవయ్య అలియాస్ అగ్రసేన్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు నిరంజన్, మాణిక్యం, అగ్నివేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పశ్చిమబెంగాల్, అసోం తదితర రాష్ట్రాల్లో 1934లోనే పార్టీ ఏర్పాటు చేయడం జరిగిందని, తెలంగాణ రాష్ట్రంలో పార్టీని విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రాష్ట్ర కార్యదర్శి వెలిజాల బసవయ్య మాట్లాడుతూ పార్టీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు

# తెలుగు సాహిత్యంలో విశిష్టస్థానం నాయిని సుబ్బారావుది

చిక్కడపల్లి, అక్టోబరు 30 ప్రభాతవార్త: తెలుగు సాహిత్యంలో విశిష్టస్థానం నాయిని సుబ్బారావుకు ఉందని ప్రముఖులు పేర్కొన్నారు. ఎందరోమహానుభావులు మధురస్మృతులు కార్యక్రమంలో భాగంగా ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి అధ్యక్షతన ప్రముఖ సాహితీవేత్త నాయిని సుబ్బారావు వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో కవులు రఘుశ్రీ, తంగిరాల చక్రవర్తి, సినీనటులు, 'మా' కార్యవర్గసభ్యుడు మాణిక్ తదితరులు పాల్గొన్నారు. సులభశైలిలో గ్రామీణ భావమరదలు రోమాంటిక్ భావాలను అందంగా కవిత రూపం రాసిన నాయిని తెలుగు సాహిత్యంలో 'ఎంకి పాత్ర'ను స్థిరం చేశారని వివరించారు.

# నేటి సినిమాల్లో అమ్మకు ప్రతిరూపం శివపార్వతి



శివపార్వతికి సూర్యకాంతం స్మారక పురస్కారాన్ని అందజేస్తున్న కృష్ణమోహనరావు

సైఫాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త: అలనాటి చిత్రాల్లో అత్తకు ప్రతిరూపంగా సూర్యకాంతం కనిపిస్తే ఈనాటి సినిమాల్లో అమ్మకు ప్రతిరూపంగా శివపార్వతి కనిపిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహనరావు చెప్పారు. అలనాటి చిత్రాల్లో సూర్యకాంతం ఆహార్యం, ఆహాభావాలు ఎంతో వైవిధ్యంగా ఉండేవని, సూర్యకాంతం దుష్టపాత్రలలో తరుచుగా కనిపించినా స్వాతిక పాత్రల్లో కూడా రాణిస్తూ నవరసనటిగా పేరుతెచ్చుకున్నారని ఆయన కొనియాడారు. ప్రముఖ ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్ఎస్ఎస్‌లో జరిగిన సుప్రసిద్ధ సినీనటి సూర్యకాంతం 98వ జయంతి సభలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా ప్రముఖ సినీమా, బుల్లితెర, నాటక రంగస్థల నటి శివపార్వతికి సూర్యకాంతం స్మారక పురస్కారంతో ఆయన ఘనంగా సత్కరించారు. ఆనాటి సినీ నిర్మాత దర్శకులు సాంఘిక దురాచారాలైన వరకట్నం, కన్యాశుల్కంకు వ్యతిరేకంగా చిత్రాలను నిర్మిస్తూ సూర్యాకాతంకు సముచిత పాత్రలు ఇచ్చి గౌరవించేవారన్నారు. సహాయనటిగా విభిన్న పాత్రలు పోషిస్తూ ఈ నాటి చిత్రాలకు అనుగుణంగా శివపార్వతి చక్కని అమ్మ పాత్రల్లో నటిస్తూ మెప్పిస్తున్నారని, అంతేకాకుండా పాత్రల్లో జీవిస్తున్నారని తెలిపారు. సూర్యకాంతంలా గొప్పనటిగా రాణించాలని అకాంక్షించారు. ప్రముఖ సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి మాట్లాడుతూ దశాబ్ధాలపాటు తెలుగు సినిమాను ఏలిన మహానటి సూర్యకాంతం అని ప్రసంసించారు. అనిర్వచనీయమైన సహజనటనతో ప్రేక్షకులపై ప్రత్యేక ముద్ర వేసిన నాటి సూర్యకాంతం పురస్కారం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని శివపార్వతి చెప్పారు. అలనాటి చిత్రాల్లోని సూర్యకాంతం డైలాగులను ఆమె వినిపించి అలరించారు. ఈ కార్యక్రమానికి ఆకృతి సుధాకర్ అధ్యక్షత వహించగా సహాయ కార్యదర్శి శ్వేత సమన్వయం చేశారు.

# రాజీవ్ గృహకల్ప ఇంట్లో శ్లాబ్ కూలి వ్యక్తికి తీవ్ర గాయాలు



రాజీవ్ గృహకల్పలోని ఓ ఇంట్లో శ్లాబ్ కూలి అందులో ఉన్న నారాయణ తల పగిలిపోయిన దృశ్యం, శ్లాబ్ కూలి ఇల్లంతా పడ్డ దృశ్యం

నార్సింగి, అక్టోబర్ 30 ప్రభాతవార్త : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గండిపేట్ మండలం గంధంగూడలో ఇచ్చిన రాజీవ్ గృహకల్ప ఇంటి శ్లాబ్ కూలి అందులో ఉంటున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. నగరానికి వలస వచ్చిన నారాయణ, జ్యోతి దంపతులు దినసరి కూలీలుగా పని చేసుకుంటూ ఈ ఇంట్లో అద్దెకుంటన్నాడు. ఆదివారం ఉదయం ఇంటి పైకప్పు పెచ్చులూడి అతడిపై పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యి, పెద్ద ఎత్తున రక్తం కారింది. వెంటనే చుట్టు పక్కల వారు ఆసుపత్రికి తరలించగా ఆయనకు ఐదు కుట్లు పడ్డాయని, ప్రస్తుతం అతడికి ఎలాంటి ప్రాణహాని లేదని స్థానికులు తెలిపారు. ఈ సంఘటనతో ఒక్కసారిగా అదురుకున్న సత్యనారాయణ ఆ ఇంట్లోకి వచ్చేందుకు భయపడిపోతున్నాడు. ఆసుపత్రిలో నుంచి డిశ్చార్జి అయ్యి తన సొంత గ్రామానికి తిరిగి వెళ్లాడు. రాజీవ్ గృహకల్పలోని అన్ని ఇళ్లు ఇలాగే ఉన్నాయని, ఎప్పుడు కూలుతాయోనని వాటిల్లో నివసిస్తున్న ప్రజలు భయాందోళన చెందుతున్నారు. చాలా నాశిరకంగా వీటిని నిర్మించారని, దీంతో పై ఇంట్లోని బాత్‌రూం నీరంతా శ్లాబులలో చేరి పెచ్చులూడి కిందుంటున్న ఇళ్లల్లో పడిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చాలా మార్లు ఇలా శ్లాబుల పెచ్చులూడాయని, కానీ ఈ సారి పెద్ద ప్రమాదమే జరిగిందని, తృటిలో ఆయన ప్రాణాలతో బయట పడ్డారని స్థానికులు పేర్కొన్నారు. వెంటనే సంబంధిత అధికార గణం, ప్రజా ప్రతినిధులు స్పందించి మా సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కుమ్మరి ప్రతినిధులు

# కుమ్మరి కులస్తులు ఐక్యంగా ఉండాలి

**సైఫాబాద్, అక్టోబరు 30, ప్రభాతవార్త :** సాంప్రదాయ వృత్తిని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న కుమ్మరి శాలివాహనులు సంఘటిత శక్తిగా ఎదగాలని, ఐక్యంగా జీవించాలని ఎసిపి శ్రీనివాసరావు, ఇగ్నో డైరెక్టర్ రమేష్, సామాజిక ఉద్యమకారుడు సిల్వేరి శ్రీశైలం పిలుపునిచ్చారు. ఆదివారం నాడిక్కడ కుమ్మరి శాలివాహనుల కార్తిక మాసం వనభోజనాలు, పరిచయ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఐక్యంగా ఉంటే హక్కులను సాధించుకోవచ్చునని స్పష్టం చేశారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో వెనుకబడ్డ కుమ్మరి శాలివాహనులు ఆ రంగాలలో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా రంగాలలో రాణించినప్పుడు, రాజ్యాధికారంలో వాటా సాధించి నప్పుడు సమస్యలు వాటంతట ఆవే పరిష్కారమవుతాయన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది కుమ్మరి శాలివాహనులు ఉన్నప్పటికి శాసన సభలో ప్రాతినిధ్యం లేకపోవడం దారుణమన్నారు. కుమ్మరి శాలివాహనులను ఏ రాజకీయ పార్టీ గుర్తించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా కుమ్మరి శాలివాహనులు ఐక్యంగా ఉండి తమ సత్తాను చాటితే అన్ని రాజకీయ పార్టీలు దిగివస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు యాదగిరి, వీరయ్య, కోశాధికారి నారాయణ, సభ్యులు మహేందర్, ఎం.రవీందర్‌కు మార్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలు, క్రీడాకారులను ఆదుకునేందుకు

# స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

**ఆల్ ఇండియా బేస్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్వేత**




బేస్ బాల్ క్రీడాకారులు, అనాధలకు అన్నదానం చేస్తున్న లయన్స్‌క్లబ్ మిడ్‌టౌన్ ప్రతినిధులు

కంటోన్మెంట్, అక్టోబర్ 30 ప్రభాత వార్త: అనాధ పిల్లలకు,క్రీడాకారులకు సహాయ సహకారాలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఆల్ ఇండియా బేస్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్వేత పిలుపు నిచ్చారు. సికింద్రాబాద్ లయన్స్‌క్లబ్ మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో ఆదివారం రైల్వే నిలయం వెనుక భాగంలో ఉన్న ఆర్ఆర్‌సీ గ్రౌండ్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర బేస్ బాల్ టోర్నమెంట్స్‌లో పాల్గొన్న క్రీడాకారులకు, అనాధ పిల్లలకు, టోర్నమెంట్స్ నిర్వహించడంతో పాటు 150 మందికి మూడు పూటల అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ లయన్స్‌క్లబ్ మిడ్‌టౌన్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ ఆకుల రామారావ్, అధ్యక్షులు రఘువీర్, పస్ట్ వైస్ ప్రెసిడెంట్ ఏ.సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నాటకీయమైన ఆధ్యాత్మిక కోణానికి ప్రతిరూపం 'దత్త కథాలవారి'

## - ఘనంగా దత్త కథాలవారి పుస్తకావిష్కరణ మహోత్సవం



ఎస్.వి.హనుమంతరావు పుస్తక పరిచయం కావించగా, ప్రొఫెసర్ సిహెచ్. సుశీలమ్మ పుస్తక విశ్లేషణ చేశారు.

**రవీంద్రభారతి, అక్టోబరు 30, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో పాణ్యం దత్తశర్మ కథలు 'దత్త కథాలహరి' పుస్తకావిష్కరణ రవీంద్రభారతిలోని సమావేశ మందిరం ఆదివారం ఉదయం ఘనంగా జరిగింది. ప్రముఖ కథా, నవలా రచయిత సింహప్రసాద్ సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత, విమర్శకుడు విహారి విశిష్ట అతిథులుగా సీనియర్ సంపాదకుడు వైఎస్ఆర్.శర్మ, ప్రసిద్ధ రచయిత వాణిశ్రీ (సిహెచ్. శివరామప్రసాద్), సిహెచ్.సుశీ లమ్మ, దూరదర్శన్ విశ్రాంత ఉద్యోగి ఎస్.వి. హనుమంతరావు తదితరులతో కలిసి 'దత్త కథా లహరి' పుస్తకాన్ని ఆవిష్కరించి దత్తశర్మ ఈ పుస్తకంలో నాటకీయమైన ఆధ్యాత్మిక కోణాన్ని అద్భుతంగా చూపించారన్నారు. అంతేకాక రాజకీయ, సమకాలీన అంశాలపై తనకున్న అవగాహనకు అద్దంపట్టిందని, మతసామరస్యత, ఐక్యతకు ప్రతీకగా ఆయన రచించిన కథలు నిలిచాయని తెలి పారు. అనంతరం

# మహారాజ్ చిత్రపటానికి నివాళ్లు



రామారావు మహారాజ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వెల్ఫేర్ సభ్యులు

సంజీవరెడ్డినగర్, అక్టోబర్ 30, ప్రభాతవార్త : అమీర్‌పేట బాపూనగర్ కమ్యూనిటీ హాల్లో ఆదివారం బాపూనగర్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిసింగ్ యాదవ్ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ రామారావు మహారాజ్ రెండవ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సి.కిషన్‌సింగ్, అజయ్ సింగ్, చావన్.డి., రాజాసింగ్, వి.టి.నాయక్, ధన్‌సింగ్, మాన్సింగ్, జైసింగ్, బి.రమేష్ ఫూల్ సింగ్సర్వన్ కుమార్ రామ్ సింగ్, రాజు నాయక్, చుకా, విజేందర్, నవీన్, ముఖేష్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అన్నారావు కులకర్ణి, కరాటే విద్యార్థులు

# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

చార్మినార్, అక్టోబరు 30 ప్రభాతవార్త : విద్యార్థులు క్రీడలలో బాగా రాణించాలని శ్రీ లక్ష్మణేశ్వర స్వామి దేవాలయం కమిటి చైర్మన్ అన్నారావు కులకర్ణి కోరారు. శివగంగానగర్‌లో ఆదివారం ఎన్‌బికెఎ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీలలో ఆయన పాలొన్నారు.పోటీలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్‌బికెఎ అధ్యక్షులు గణేష్ నాయక్, కె.రవీందర్,వాసేదేవ్,రాహుల్,తనీషా రెడ్డి,శివానీ తదితరుల పాల్గొన్నారు.

# యువకుడు ఆత్మహత్య

**అల్వాల్, అక్టోబరు 30, ప్రభాతవార్త :** ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిం ది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఎస్‌రావు నగర్‌కు చెందిన శరత్‌చంద్ర(28) మూడు సంవత్సరాలు క్రితం మలేషియా వెళ్ళాడు. వీసా గడువు ముగియడంతో పునరుద్దరణ కోసం ఇటీవల స్వదేశానికి వచ్చాడు. మచ్చబొల్లారంలో నివాసం ఉండే స్నేహితులు వద్ద శరత్‌చంద్ర శనివారం వెళ్ళడం జరిగింది. స్నేహితులతో సంతోషంగా గడిపిన బాధితుడు తెల్లవారు జాము ఆదివారం సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# కవులు, కళాకారులు మౌనంగా ఉంటే సమాజం స్తబ్దంగా ఉంటుంది

## తెలంగాణ కవులు, కళాకారులకు దక్కాల్సిన గౌరవం దక్కడం లేదు.. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి



'నిప్పులవాగు' పుస్తకావిష్కరణ సభలో పాల్గొన్న సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, వీరవనితలు వలసమోని జానమ్మ, జంగిటి లచ్చవ్వ, కుంజ రమణమ్మ, అందెశ్రీ, సుద్దాల అశోక్‌తేజ తదితరులు

చిక్కడపల్లి, అక్టోబరు 30 ప్రభాతవార్త: కవులు, కళాకారులు మౌనంగా ఉంటే సమాజం స్తబ్దంగా ఉంటుందని, వారంతా నిర్భయంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో వాక్కులమ్మప్రచురణ హైదరాబాద్ ఆధ్వర్యంలో లోకకవి అందెశ్రీ సాంపాదకత్వంలో వెలువడిన 'నిప్పుల వాగు' పుస్తకావిష్కరణ సభ సుప్రసిద్ధ సాహితీవేత్త ఆచార్య జయధీర్ తిరుమలరావు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఈ గ్రంథాన్ని కోయ వనిత కుంజ రమణమ్మ, బైరాన్‌పల్లి పోరాట వీరమాత జంగిటి లచ్చవ్వ, పాలమూరు వలసల కష్టజీవి వలస మోని జానమ్మ చేతులమీదుగా ఆవిష్కరింపచేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ నిప్పులవాగు ఒక మహాసంకల్పం అని అన్నారు. కవిత్వంలో అన్ని రసాలు అన్ని భావాలు తెలంగాణ వ్యక్తులకు మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు. అందెశ్రీకి చదువులేకపోయినా, మనిషి మాత్రం నిత్య నవనీతుడని కొనియాడారు. తెలంగాణ కవులు, కళాకారులకు దక్కాల్సిన గౌరవం మారిపోయిందని, ఆదరణ లేకుండాపోయిందని అన్నారు. సమాజంలో ఆదేశిక సూత్రాలు ఉన్నాయన్న మాతే తప్ప పాలకులు వాటి అమలును మరిచిపోయారని అన్నారు. తెలంగాణ సంక్షోభనందికాలం నడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సభకు అధ్యక్షత వహించిన ఆచార్య జయధీర్ తిరుమలరావు మాట్లాడుతూ ఈ సమయంలో ఇటువంటి పుస్తకాలు రావడం చారిత్రక అవసరమని అన్నారు. 'నిప్పులవాగు' పుస్తకంలో ప్రతి ఒక్కరు ఆనాటి మలి, తొలి దశ ఉద్యమంలో జరిగిన అంశాలు కళ్లకుకట్టినట్లుగా వెలువరించడం జరిగిందన్నారు. నిప్పులవాగు తెలంగాణ వారసత్వ సంపద అని, 535 కవులతోపాటు కొంతమంది అజ్ఞాత కవులు, 10 సంవత్సరాల శ్రమ, 75 సంవత్సరాల పాట చరిత్ర, 1400 పేజీల పుస్తకం ఇది అని అన్నారు. నిప్పులవాగు పుస్తకం తెలంగాణ వారసత్వ సంపద అని అన్నారు. ఒక మనిషిని మరోలోకంలోకి తీసుకెళ్లే శాటిలైట్ వంటిదన్నారు. చరిత్రను వర్ధమానానికి పరిచయం చేసే ఒక సాంస్కృతిక వారది 'నిప్పుల వాగు' అని అన్నారు. ఈ పుస్తకం చేతిలో ఉంటే చాలు ఎంతో మంది తెలంగాణ కవులు, కళాకారులు మనతో ఉన్నట్లేనని, పుస్తకం అంటే ఒక వస్తూవు కాదు దాన్ని నిర్మించడంలోనే ఒకపనివాడి తనం కనిపిస్తోందని, నిజంగా అందెశ్రీ అద్భుతమైన పుస్తకాన్ని వెలుగులోకి తీసుకువచ్చారని అన్నారు. అనంతరం అందెశ్రీ తన అనుభవాలను, పుస్తకం రావడానికి గల కారణాలను కిక్కిరిసిని ప్రేక్షకులు, అభిమానుల, స్నేహితులు, కవులు, కళాకారుల మధ్య నర్మగర్భంగా పంచుకున్నారు. ఈ సమావేశంలో ప్రముఖ పాత్రికేయులు కె.శ్రీనివాస్, గ్రంథాన్ని ప్రముఖ సినీగేయరచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ విశ్లేషించగా గ్రంథాన్ని తెరవే అధ్యక్షుడు గాజోజు నాగభూషణం సమీక్షించారు. మోదుగుపూలు ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు అతిథులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రేక్షకుల్లో ప్రముఖ విశ్లేషకులు ప్రొఫెసర్‌హరగోపాల్, తెలంగాణ జనసమితి అధినేత ప్రొఫెసర్ కోదండరామ్, తెలంగాణ జలవనరుల కార్పొరేషన్ చైర్మన్ వి.ప్రకాశ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, కేంద్ర యువసాహితీ అవార్డుగ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ పాల్గొన్నారు. ముందుగా అందెశ్రీ రాసి జయజయహే తెలంగాణ గీతాన్ని బండి శ్రీనివాస్ గానం చేశారు.


కరాటే క్రీడాకారులతో సబిత ఆంజనేయులు గౌడ్, తదితరులు

## ఆపదలో ఆత్మరక్షణకు కరాటే అవసరం : కౌన్సిలర్

**నాగారం అక్టోబర్30,ప్రభాతవార్త :** ఆపదలో ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందని నాగారం మున్సిపల్ కౌన్సిలర్ గూడూరు సబిత ఆంజనేయులు గౌడ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 7వ.వార్డు శివసాయి గార్డెన్స్‌లో చిదంబ్ తైక్వాండో అకాడమీ మాస్టర్ నందకిషోర్ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ పొందిన 150 మంది విద్యార్థులకు టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ....ప్రాణం మీదికి ముప్పువచ్చినప్పుడు బలప్రయోగానికి స్వీయ రక్షణ కొరకు కరాటే శిక్షణ తప్పనిసరిగా నేర్చుకోవాలన్నారు. బ్రహ్మయ్య కాలనీ మాజీ ప్రధాన కార్యదర్శి మధుగౌడ్ స్వంత ఖర్చుతో టోర్నమెంట్‌కు కావలసిన మెమొంటో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు స్థానిక కౌన్సిలర్ సబిత ఆంజనేయులు గౌడ్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్స్ ప్రవీణ్ కుమార్, అరవింద్, కోచ్ చంద్రశేఖర్, ధనంజయ్, గణేష్, రాజుతవానీ, యాదగిరి, పాపా నాయక్, తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి: చైర్మన్


అన్నోజిగూడలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న చైర్మన్ కొండల్ రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 30, ప్రభాత వార్త:** ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ సర్వేనెంబరు 7 లో ఆదివారం చైర్మన్ మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా గుర్తెరిగి మొక్కలు నాటాలని అన్నారు. పచ్చదనంతో పరిసరా ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండటమే కాకుండా మంచి వాతావరణాన్ని పెంపొందించినట్లవుతుందని అన్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. తడి పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, మున్సిపల్ సూపర్‌వైజర్ గాంధారి అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మరోసారి కాంగ్రెస్ పార్టీలో ఫ్లెక్సీల రగడ

### - ఒక వర్గం నాయకుడి ఫ్లెక్సీలు చించివేసిన మరో వర్గం

**షాద్‌నగర్, అక్టోబర్ 30, (ప్రభాతవార్త) :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏ కార్యక్రమాన్ని తలపెట్టిన షాద్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న వర్గాపోరుతో ఇరు వర్గాల మధ్య రగడ మొదలవుతుంది... ప్రస్తుతం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర షాద్‌నగర్‌కు రాబోతుండటంతో ఆయనకు స్వాగతం పలికేందుకు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోటా పోటీన పాతజాతీయ రహదారులపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో ఒక వర్గం వారు మరో వర్గానికి సంబంధించిన ఫ్లెక్సీలను చించివేయడంతో షాద్‌నగర్ కాంగ్రెస్ పార్టీలో మరో మారు ఫ్లెక్సీల రగడ మొదలైంది. పార్టీ సీనియర్ నాయకుడైన కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్‌కు సంబంధించిన ఫ్లెక్సీలు చినిగిపోవడంతో ఆయన వర్గానికి చెందిన వారు ఇదీ వీర్లపల్లి శంకర్ వర్గం వారు చించారుని కడెంపల్లి శ్రీనివాస్ వెంట ఉండే కొందరు ఆరోపించారు. అదేవిధంగా వారు షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ల్లో సహితం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయబోతున్నట్లు తెలిపారు. దీంతో సామాన్య కార్యకర్తల్లో సహితం ఏ వర్గానికి సహకరించాల్లో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన పార్టీ పెద్దలు కలగ చేసుకొని ఈ వర్గాపోరు సమస్యను పరిష్కారించాలని చాలా మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బాహటంగానే చర్చించుకుంటున్నారు.

## వరద బాధితులకు అండగా నిలుస్తాం : మున్సిపల్ చైర్మెన్

**కొడంగల్, అక్టోబర్ 30ప్రభాతవార్త :** ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఇళ్ళలోకి నీరు చేరి నష్టపోయిన వరద బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని మున్సిపల్ చెర్మెన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీమహలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని మంటపంలో వరద బాధితులకు నిత్యవసర సరకుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వర్షం కారణంగా పట్టణంలోని బాలాజీనగర్ ప్రాంతంలోని 29 కుటుంబాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకుగాను వరద బాధిత కుటుంబాలకు డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి అందేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బాధితులందరికి సహయం అందించేందుకు బాధ్యత సంస్థ, లయన్స్‌క్లబ్, అధ్యాత్మిక, ధార్మిక సేవా సంస్థ, ఎన్ఆర్ఐ, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు సంయుక్తంగా తమవంతు సహయం అందించేందుకు ముందుకు రావడం హర్షణీయమన్నారు. అనంతరం 29 మంది బాధిత కుటుంబాలకు బియ్యం, జొన్నలు, నిత్యవసర సరుకుల ప్యాకెట్‌లను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చెర్మెన్ ఉషారాజేందర్, ఎన్ఆర్ఐ హరిప్రసాద్ వశిష్ట, లయన్స్‌క్లబ్ కార్యదర్శి దాసప్పయాదవ్, సభ్యులు లోకూర్తి జయతీర్థాచారీ, మురారి వశిష్ట, కట్కం శివకుమార్‌గుప్త, నందారం ప్రశాంత్, మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్, ఆనంద్‌లోహోటీ, నాగు తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద సిపిఐ ధర్నా

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 30, ప్రభాతవార్త**

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 31న (సోమవారం) ఉదయం 11.30గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా జరుగుతుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎన్.బాలమల్లేశ్ పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వ భూముల కబ్జాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద సిపిఐ ధర్నా నిర్వహిస్తుందన్నారు. దీనికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు విచ్చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## బాలుడి అదృశ్యం-కేసు నమోదు

**కొడంగల్, అక్టోబర్ 30ప్రభాతవార్త**

ఇంటి బయట ఆడుకుంటున్న బాలుడు అదృశ్యమైన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవిగౌడ్ తెలిపారు. సంఘటనకు సంభదించి ఎస్సై కథనం మేరకు..కొడంగల్ పట్టణంలోని మిట్టిబౌలీ ప్రాంతానికి చెందిన అఫ్రోజ్‌ఖాన్ కుమారుడు రజాక్(12) శనివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో సైకిల్‌పై ఆడుకునేందుకు బయటకు వెళ్ళాడు. అనంతరం కొద్ది సేపటికి సైకిల్ మాత్రం గాంధీనగర్ కాలనీలో లభించగా బాలుడు మాత్రం కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు బాలుడి ఆచూకి కోసం వెతికారు. బంధువులు, స్నేహితుల ఇళ్ళలో వెతికినా కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రజాక్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఘనంగా మాతా మహాక్షేత్రంలో అభిషేకాలు

**శామీర్‌పేట, అక్టోబరు 30, ప్రభాతవార్త**

కార్తీకమాసం సందర్భంగ తూంకుంటలోని శ్రీగాయిత్రీ మాత మహాక్షేత్రం లో శ్రీ ఉమామహేశ్వరస్వామికి ఆదివారం ఘనంగ అభిషేకాలు నిర్వహించారు. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలోని శ్రీగాయిత్రీ మాత మహాక్షేత్రంలో కార్తీకమాసంను పురస్కరించుకుని ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్ఎల్ఎన్‌మూర్తి ఆధ్వర్యంలో కార్తీకమాసం అభిషేకాల పూజలు జరిగాయి.

# ఎమ్మెల్యేను ప్రశ్నిస్తే మీరు ఎందుకు సమాధానం చెబుతున్నారు

**గుర్రం అనంతరెడ్డి**

**శంషాబాద్ అక్టోబర్30,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడి ఉన్నదని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ రాజీనామా చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని నేను ప్రశ్నిస్తే ఆయన సమాధానం చెప్పకపోగా కొందరు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు స్పందించడం ఏమిటని చిన్న గోల్కొండ సింగిల్ విండో డైరెక్టర్ గుర్రం చిన్న అనంతరెడ్డి ప్రశ్నించారు. హుజురాబాద్ ,మునుగోడు ,దుబ్బాక, ఉప ఎన్నికలు జరిగినందున ఆ ప్రాంతాల్లో వందలాది కోట్ల రూపాయలు వెచ్చించి రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టిందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే రాజీనామా చేస్తే కూడా ఇక్కడ అదే విధంగా అభివృద్ధి సాధ్యమవుతుందని తాను మరోసారి చెబుతున్నానని స్పష్టం చేశారు. దీనిపై సుల్తాన్‌పల్లి సర్పంచ్ దండు ఇస్త్రారి పెద్ద గోల్కొండ ఎంపిటిసి గడ్డమీది యాదగిరి స్పందించడం ఏమిటని ప్రశ్నించారు. పెద్ద గొల్కొండ గ్రామానికి దళిత బంధు క్రింద 5 మందిని ఎంపిక చేయాల్సి ఉండగా తన సొంత తండ్రికి లబ్ధిదారుడిగా ఎంపిక చేసిన యాదగిరి నాకు నీతులు చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. సయ్యద్ గూడ ,రెవెన్యూ గ్రామంలో హామిదుల్లా నగర్ మాజీ సర్పంచ్ నవారు ముత్యం రెడ్డి, సోదరులు పేరుమీద ప్రభుత్వ భూమి ఉంటే వారికి పట్టా చేసి చిన్న గోల్కొండ గ్రామానికి చెందిన నిరుపేద బుడగ జంగాలకు చెందిన భూమి ని పిటిపి కింద తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. చిన్న గోల్కొండ సహకారం సంఘానికి జరిగిన ఎన్నికల్లో టిఆర్ఎస్ బలపరిచిన ఇద్దరు వ్యక్తులు మాత్రమే గెలువగా పోలీసులను అడ్డం పెట్టుకొని బలవంతంగా మిగతా వారితో ఓటు వేయించుకొని దమనాకర్ గౌడ్‌ను చైర్మన్ చేశారని ఆరోపించారు. దమ్ము ఉంటే దవణాకర్ గౌడ్‌తో రాజీనామా చేయించాలని నేను కూడా రాజీనామా చేస్తా మళ్లి జరిగే ఎన్నికల్లో ఎవరు గెలిస్తే వారికి చైర్మన్ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రకాష్ గౌడ్ ఎమ్మెల్యే అయిన తర్వాత శంషాబాద్‌లో ఒక బస్టాండ్ కూడా నిర్మించలేకపోయారని రోడ్డు పక్కన వేలాదిమంది విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ మోసల కోసం ఎదురు చూస్తున్నారని ఏమైనా ఒక వాహనానికి బ్రేక్ ఫెయిల్ అయితే వందలాది మంది చనిపోయే ప్రమాదం ఉన్నదని అనంతరెడ్డి పేర్కొన్నారు. శంషాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న పోస్టుమార్టం గదిని కూడా నిర్మించలేని వ్యక్తి శంషాబాద్‌లో ఏం అభివృద్ధి చేస్తాడని అన్నారు. కేవలం కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే నిధులతో మాత్రమే గ్రామాలలో అభివృద్ధి జరుగుతున్నదని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నిధులను దారి మళ్లించి పంచాయతీలను నిర్వీర్యం చేస్తున్నదని ఆయన ఆందోలన వ్యక్తం చేశారు. సంబంధం లేని విషయాలలో దండు ఇస్త్రారి గడ్డమీది యాదగిరి జోక్యం చేసుకుంటే బాగుండదని హెచ్చరించారు.


మునుగోడు సభకు తరలిన శంషాబాద్ నాయకులు

## బహిరంగ సభకు భారీగా తరలిన నాయకులు

**శంషాబాద్ అక్టోబర్30,ప్రభాతవార్త :** మునుగోడు ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొనడానికి శంషాబాద్ నుండి టిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొడిగంటి చంద్రారెడ్డి, జడ్పిటిసి తన్విరాజు ముదిరాజ్, మాజీ సర్పంచ్ గణేష్ గుప్తా ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. టిఆర్ఎస్ జిందాబాద్ ,కెసిఆర్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. మండలం మున్సిపాలిటీ నుండి భారీ వాహనాల శ్రేణితో చుండూరుకు తరలివెళ్లారు. టిఆర్ఎస్ నాయకులు వాంకర దావత్ మోహన్ నాయక్, పొరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, రాజశేఖర్‌గౌడ్, ఆనగొని శ్రీకాంత్ గౌడ్, మల్కారం లక్ష్మణ్, నీళ్ల శ్రీధర్ గౌడ్, పిల్లన గోయిల నాగేష్ యాదవ్, రాల్లగూడ, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ సొమ్ముతో సోకులు చేస్తున్న ప్రభుత్వం

**పతంగి రాజ్ భూపాల్ గౌడ్**


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రాజ్ భూపాల్ గౌడ్

**శంషాబాద్ అక్టోబర్30,ప్రభాతవార్త :** కులవృత్తులు వివిధ సంక్షేమ పథకాల కోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను ముఖ్యమంత్రి కెసిఆర్ దారి మళ్లించి వాటి పేర్లను మార్చి తమ పథకాలుగా ప్రచారం చేసుకుంటున్నారని శంషాబాద్ మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు బిజెవైఎం నాయకుడు పంతంగి రాజభూపాల్ గౌడ్ ఆరోపించారు. మునుగోడు ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ఎంపి బుర నర్సయ్య గౌడ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ....సొమ్మొక్కడిది సోకొక్కడిది అనే విధంగా ముఖ్యమంత్రి కెసిఆర్ టిఆర్ఎస్ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. మాంసా ఉత్పత్తి దిగుమతులను పెంచడం కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 5వేల కోట్ల రూపాయలు ఇస్తే దానికి రంగు రూపు మార్చి గొర్రెల పంపిణీ అంటూ రాష్ట్ర ప్రభుత్వం తన పథకంగా డప్పు కొట్టుకుంటున్నదని ఆరోపించారు. గొల్ల కురుమల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం కోసం కేంద్రం నిధులు మంజూరు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వాటిని కేవలం ప్రచారానికి ఉపయోగించుకునే పథకంగా మార్చిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి లేకుండా ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చించిన గొల్ల కురుమలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధి కేంద్రం ప్రభుత్వం ఇచ్చే నిధులను దారి మళ్లించి పంచాయతీ వ్యవస్థను పూర్తిగా నీరు కార్చడం వల్లనే అనేక గ్రామాల్లో నిధులు లేక సర్పంచ్‌లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని రాజ్ భూపాల్ గౌడ్ పేర్కొన్నారు. విజ్ఞులైన మునుగోడు ప్రజలు అన్ని ఆలోచించి కమలం గుర్తుకు ఓటు వేసి రాజగోపాల్ రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

## రైతులకు పాసుబుక్కులు ఇవ్వకుంటే రాజీనామా చేయాలి

**జీవన్ గౌడ్**

**శంషాబాద్ అక్టోబర్30,ప్రభాతవార్త :** బహదూర్ గూడ రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను మంజూరు చేయకుండా ఇదిగో అదిగో అంటూ ఎంతకాలం కాలయాపన చేస్తారని ఆ గ్రామ కాంగ్రెస్ నాయకుడు చిన్న గోల్కొండ సహకార సంఘం పాలకవర్గ సభ్యుడు కమ్మదనం జీవన్‌గౌడ్ ప్రశ్నించారు. సర్పంచులు, ఎంపిటిసిలు ఎమ్మెల్యేలు మారుతున్న రైతుల సమస్య మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చుట్టుపక్కల గ్రామాల రైతులందరికి రైతుబంధు, రైతుబీమా పథకాలు వర్తించడం లేదని ఆయన ప్రశ్నించారు. చుట్టుపక్కల కోట్లాది రూపాయలకు ఎకరం విక్రయి స్తుండగా తమ గ్రామ రైతులు ఆడపిల్ల పెళ్లి చేయాలన్న అమ్ముకునే పరిస్థితి లేదని అమ్ముకున్న వారికి అడ్డికి పావు సేర్ డబ్బులు మాత్రమే వస్తున్నాయని జీవన్ గౌడ్ అన్నారు. ఎన్నికల సమయంలో అందరూ వాగ్దానాలు చేసి ఓట్లు వేయించుకుంటు న్నారు. కానీ రైతుల సమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదని నూతన సంవత్స రంలో పాసు బుక్కులు వస్తాయని చెబుతున్న సర్పంచ్ సుజాత వెంకటేష్ గౌడ్ పాసుబుక్కులు ఇప్పించని పక్షంలో పదవికి రాజీనామా చేస్తారా అని అన్నారు. రైతు సమస్యపై చిత్తశుద్ధితో పని చేసే వారు లేకపోవడం వల్లనే సమస్య పరిష్కారం కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## తల్లిబిడ్డల ప్రాణాలు కాపాడిన ఎస్సై

**దౌల్తాబాద్, అక్టోబర్ 30,ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలో క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకోబోతున్న తల్లి ఇద్దరు బిడ్డల ప్రాణాలు ఎస్సై రమేష్‌కుమార్ కాపాడారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం దౌల్తాబాద్ గ్రామానికి చెందిన బొక్క లక్ష్మి భర్త చెన్నప్ప ముదిరాజ్ అనే వివాహిత ఇంట్లో చిన్నచిన్న సంఘటనలకే మనస్తాపం చెంది, క్షణికావేశంలో తన ఇద్దరు పిల్లలతో కలిసి దౌల్తాబాద్ చెరువులో దూకడానికి వెళ్తుండగా...స్థానిక ఎస్సై రమేష్‌కుమార్ తన సిబ్బందితో కలిసి అక్కడే ఉన్న సమయంలో అటుగా వెళ్తున్న వారిని చూసి అనుమానంతో వెళ్లి వివాహితను నిలువరించి తనని అడిగారు. ఆమె వివరాలు చెప్తూ...తన ఇంట్లో తగాదాల వలన తాను చెరువులో దూకి చనిపోవాలని నిర్ణయించుకుని చెరువుకట్టపైకి వచ్చానని తెలిపిందన్నారు. ఆత్మహత్య చేసుకోవాలనుకున్న బొక్క లక్ష్మిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్ళి, ఆమె భర్త అయిన చెన్నప్పను అక్కడికి పిలిపించి భార్యభర్తలకుకౌన్సిలింగ్ ఇచ్చి వారి ఇంటికి పంపించారు.

## కరాటే పోటీలలో న్యూ జనరేషన్ పాఠశాలవిద్యార్థులు

### -సినీ నటుడు సుమన్‌చే పతకాలు అందజేత

**బొంరాస్‌పేట్, అక్టోబర్30,ప్రభాతవార్త :** వనపర్తిలో నిర్వహించిన స్టేట్ లేవెల్ టైగర్ బ్రూస్లీ శోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ నిర్వహించిన కరాటే పోటీలలో బొంరాస్‌పేట్ మండలం బాపల్లితాండలో ఉన్న న్యూ జనరేషన్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. విషంత్, జగన్‌కు బంగారు పతకాలు, శ్రీధర్ వెండి పతకం, సాయిప్రణీత్, రాంచరణ్‌లకు కాంస్య పతకాలను సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా పతకాలను అందుకున్నారు. పతకాలు సాధించిన విద్యార్థులకు కరస్పాడెంట్ మల్లేష్ యాదవ్ అభినందనలు తెలిపారు. ప్రిన్సిపల్ నవీన్ పాల్గొన్నారు.


పతకాలను అందిస్తున్న సినీ నటుడు సుమన్


భారత్ జోడో యాత్రకు షాబాద్ నుండి వెళ్లిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

## భారత్ జోడో పాదయాత్రకు తరలిన షాబాద్ శ్రేణులు

**షాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న స్వార్ధపూరిత రాజకీయాలతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిషా ౽్కర మీ లక్ష ్యంగా ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రను చేపట్టారని టీపీసీసీ కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. భారత్ జోడో యాత్ర రంగారెడ్డి జిల్లాలో ప్రవేశి స్తున్న నేపథ్యంలో ఆదివారం షాబాద్ మండలం నుండి మధుసూ దన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు, భారీ సంఖ్యలో షాద్‌నగర్‌కు తరలివెళ్లారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... దేశంలో ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు ప్రజల నుండి విశేష స్పందన వస్తుందన్నారు. ఈపాద యాత్రలో ప్రజలు స్వచ ్ఛందంగా పాల్గొంటున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీ చేస్తున్న కుళ్లు రాజకీయాలకు త్వరలోనే ముగింపు పడనుందన్నారు. ఈకార్యక్రమంలో షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తమ్మలి రవీందర్, ఎంపీటీసీలు వెంకట్‌రెడ్డి, కుమ్మరి చెన్నయ్య, ఆశోక్, మాజీ సర్పంచులు ఆర్.శేఖర్, బుచ్చయ్య, ఆంజనేయులుగౌడ్, రవీందర్‌నాయక్, నాయకులు పామెన నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి, జంగయ్య, గౌరీశ్వర్, శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, జలీల్, సాయి, యాదయ్య, పాల్గుట్ట సత్యం, వీరంపల్లి యాదయ్య, సయ్యద్ ఆశ్వక్, చేవెళ్ల స్వామి, కృష్ణ, యాదగిరి, గోపాల్, కృష్ణారెడ్డి, చంద్రయ్య, యాదయ్య, కృష్ణ, నర్సింలు తదితరులు ఉన్నారు.

## భారత్ జోడోయాత్రను విజయవంతం చేయాలి

### -కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నర్సిములు గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న నర్సిములు గౌడ్

**బొంరాస్‌పేట్, అక్టోబర్30,ప్రభాతవార్త :** ఏఐసీసీ మాజీ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపి రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్రను బొంరాస్‌పేట్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల అధ్యక్షులు నర్సిములు గౌడ్ అన్నారు. అయన మాట్లాడుతూ భారత్ జోడోయాత్ర 1వ తేది మంగళవారం నాడు మధ్యాహ్నం 3గంటలకు హైదారాబాద్‌లోని చార్మినార్ నుండి నెక్లెస్ రోడ్ వరకు కొనసాగుతుందని తెలిపారు. సాయంత్రం 5గంటలకు నెక్లెస్ రోడ్‌లో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం దగ్గర భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. బొంరాస్‌పేట్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో జయకృష్ణ, వెంకట్‌రాములు గౌడ్, అంజిల్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, దేశ్యానాయక్, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలు నెరవేర్చని మంత్రి మల్లారెడ్డి రాజీనామా చేయాలి


రావల్‌కోల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బిజెపి నాయకులు

**మేడ్చల్, అక్టోబర్ 30. ప్రభాతవార్త :** రావల్‌కోల్ గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని ఇచ్చిన హామీలు నెరవేర్చని మంత్రి మల్లారెడ్డి రాజీనామా చేయాలని ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు ఆకుల రవీందర్, ఆ గ్రామ బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. మాట ఇచ్చి మంత్రి మ ల్లారెడ్డి అభివృద్ధిని మరిచారని బిజెపి నాయకులు ఆరోపిస్తూ మేడ్చల్ మండలంలోని రావల్‌కోల్ ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రావల్‌కోల్ గ్రామానికి రూ 4 కోట్ల వెచ్చించి రోడ్డును వేయిస్తానని చెప్పడంతో పాటు గ్రామంలో నుండి టిప్పర్ లారీలు తిరగకుండా ప్రత్యా న్మాయం ఏర్పాటు చేస్తానని, గ్రామ శివారులోని వాగు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపడుతానని, మేడ్చల్ చెక్‌పోస్టు వద్ద కూల్చివేసిన కమాన్‌ను తిరిగి నిర్మిస్తామని ఔమంత్రి హమి ఇచ్చి సంవత్సరాలు గడుస్తున్నా పనులు ప్రారంభం కాలేదని ఆరోపించారు. ఆకుల రవీందర్‌తో పాటు రావల్‌కో ట్ గ్రామ బిజెపి బూత్ అధ్యక్షుడు చుక్క సత్యనా రాయణ, గ్రామ బిజెపి నాయకులు పబ్బోజి నాగరాజు, మామిండ్ల దేవేందర్, వై నవీన్ యాదవ్, పిట్ల శ్రీకాంత్, ఎనబోయిన భిక్షపతి, రాజు నాయక్, కిషన్ నాయక్, బంటు సత్యనారాయణ, సుక్క శంకర్ పాల్గొన్నారు.

## విజయవంతమైన రక్తదాన శిబిరం

**కొడంగల్, అక్టోబర్ 30ప్రభాతవార్త**

అత్యవసర అపద సమయంలో రక్తదానం..మరొకరికి ప్రాణదానంగా నిలుస్తుందని పర్గి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాని ్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణం లోని రాఘవేంద్ర ఫంక్షన్‌హాల్‌లో పోలీసుశాఖ, లయన్స్‌క్లబ్ వారి సం యుక్త అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పోలీసులు, యువకులు సుమారు 104 మందికి పైగా రక్తదాన శిబిరంలో పాల్గొ న్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతు ప్రతి రక్తం చుక్క మరొకరికి ప్రాణదానం చేసే అమృతం లాంటిదని కొనియాడారు సీఐ శంకర్, పరిగి సీఐ వెంకటేశ్వర్లు, స్దానిక ఎస్సై రవిగౌడ్, బొంరాస్‌పేట్ ఎస్సై నయ్యూం, దౌల్తాబాద్ ఎస్సై రమేష్, దోమ ఎస్సై విశ్వజాన్‌లతో పాటు డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రవీంద్రయాదవ్, లయన్స్ క్లబ్ కార్యదర్శి దాసప్పయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**తలకొండపల్లి అక్టోబర్30,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల కేంద్రంలో జడ్పిహెచ్ఎస్ హైస్కూల్లో 1986-87 సంవత్సరంలో ఎస్ఎస్‌సి చదివిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా 35 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని వారు అన్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ సంతోషం కష్టాల గురించి తెలుసుకున్నారు. ఇటీవల అకాల మరణం చెందిన మిత్రులకు నివాళులు అర్పించారు. సంవత్సరానికి ఒకసారి తప్పనిసారిగా అందరూ కలిసుకోవాలని వారు తీర్మానం చేశారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్, అప్ప రవి కుమార్, శివ కుమార్ ,బిల్లా కంటి శేఖర్, నరోత్తం రెడ్డి, కృష్ణాజీ, వెంకట్రారెడ్డి, గోవర్దన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, తిరుపతి, వీరారెడ్డి, మల్లేష్, రాములు, జంగయ్య, వజ్ర లింగం, పీతాంబర్, తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడు ప్రచారంలో పాల్గొన్న శ్రీనివాస్ యాదవ్


ప్రచారంలో పాల్గొన్న శ్రీనివాస్ యాదవ్

**తలకొండపల్లి అక్టోబర్30,ప్రభాతవార్త :** మునుగోడు ఉప ఎన్నికలో భాగంగా మునుగోడు నియోజకవర్గం సంస్థాన్ నారాయణ పూర్ మండల్ జనగాం గ్రామ పంచాయతీ అరిగుడెం గ్రామానికి చెందిన వారు హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ సీనియర్ నాయకులు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ ఓటర్లను కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనగామ గ్రామ నాయకులు రాములు యాదవ్, శంకర్ యాదవ్, శ్రీశైలం, కాశయ్య, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జీవితం యువతకు స్ఫూర్తి దాయకం


అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న కౌన్సిలర్ బాల్‌రెడ్డి, పిబిఐ సమన్వయకర్త అరుణ్‌కుమార్

**ఘట్‌కేసర్, అక్టోబర్ 30, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 81వ వారం నిత్యపూలమాళ కార్యక్రమం నిర్వహించారు. పోచారం మున్సిపల్ కౌన్సిలర్ మెట్టు బాల్‌రాెడ్డి విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. పిబిఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త ఎం.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బాల్‌రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చడానికి ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. అంబేద్కర్ విధంగా బోధించి, సమీకరించు, పోరాడు అనే సూత్రం ఆధారంగా ఐక్యమత్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మేకల దాసు, నాయకులు నర్సింహ్మా, బాలయ్య, నర్సింగ్‌రావు, శివకిషోర్, శరత్‌చ నవీన్‌కుమార్, సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రావు, మైసయ్య, శ్రీనివాస్, అంజయ్య, అనిల్‌కుమార్, కృష్ణ, చందు, శ్రీకాంత్, భరత్, విష్ణు, నితిన్, నిఖిల్, కేతన్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

**మేడ్చల్, అక్టోబర్ 30. ప్రభాతవార్త :** వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా జీవించాలని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటి వార్డు కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్ అన్నాడు. ప్రతి ఆదివారం 10 గంటల 10 నిమిషాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం గుండ్లపోచంపల్లిలోని శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయ ప్రాంగణంలో పిచ్చిగడ్డి, పిచ్చి మొక్కలను శుభ్రం చేసి, నిలిచిన నీటిని తీసివేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం జీవించే పరిసరాలు బాగుంటేనే మనం బాగుంటామని, ఎప్పికప్పుడు ప్రతి ఒక్కరు ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరాడు.

## ఘనంగా చట్ పూజ

**మేడ్చల్, అక్టోబర్ 30. ప్రభాతవార్త :** మేడ్చల్ పట్టణం, మేడ్చల్ మున్సిపాలిటిలోని అత్వెల్లి గ్రామంలో ఆదివారం మేడ్చల్ పట్టణం, పరిసర ప్రాంతాల్లో నివాసమున్న ఉత్తర భారతీయయులు చట్ పూజను భక్తి శ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. పట్టణ ఎర్రచెరువు, అత్వెల్లిలోని చెరువు వద్దకు సాయంత్రం పెద్ద ఎత్తున తరలివెళ్లిన జనాలు చెరువు ఒడ్డున చెరుకు గడలతో పూజలు జరిపారు. అతే విదంగా గట్టుపైన పూలు, పండ్లతో సూర్యభగవానునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో చెరువు వద్ద కోలాహలంగా మారింది, సాయంత్రం నుండి రాత్రి వరకు ఉత్సహంగా పండుగను జరిపి పూజలు చేశారు.

## కార్తీకమాస పూజలు,వనబోజనాలు

**శామీర్‌పేట, అక్టోబరు 30, ప్రభాతవార్త**

తెలంగాణ ఆర్యవైశ్య ఇండస్ట్రియలీస్ట్స్ ఫోరం ఆధ్వర్యంలో కార్తీక మాసం వనబోజనాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆదివారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని రాగి కన్వెన్షన్ హాల్ ప్రాంగణంలో కార్తీకమాస వనబోజన కార్యక్రమం జరిగింది. ఆ ప్రాంగణంలోనే రుద్రాభిషేకం, ఉసిరిచెట్టుకు, గోమాత పూజలతో పాటు తంబోలా ఫోటో, ఫన్‌గేమ్స్ నిర్వహించి సామూహిక వనబోజనాలు నిర్వహించుకున్నారు. తెలంగాణ ఆర్యవైశ్య ఇండస్ట్రియలీస్ట్స్ ఫోరం ప్రధాన కార్యదర్శి పి.రవిప్రసన్నకుమార్, కోశాధికారి అనంతుల దయాకర్, ప్రాజెక్టు చైర్మన్ పి.రాంబాబు, అంబటి సునీల్‌కుమార్, పలువురు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

**మొయినాబాద్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** కోడింగ్ గురుకుల పాఠశాలలో విద్యార్దులకు అన్ని విదాల సౌకర్యాలు, బౌవిష్యత్ సాంకేతికాభివృద్దిలో అద్భుతమైన కంప్యూటర్ పరిజ్ఞానం అందించడానికి, విద్యకోసం సకల సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కంప్యూటర్‌ల పంపిణి కార్యక్రమం నిర్వహించిందని గురుకులాల కార్యాదర్శి రోనాల్డ్ రోస్‌తెలిపారు, ఆదివారం విద్యార్దులకు కంప్యూట్‌లాబ్ ప్రారంభానికి వచ్చినటువంటి, ముఖ్య అతిధిలు ఒయేస్‌డి చెంద్రశేఖర్ రెడ్డి, రంగారెడ్డి, హైద్రాబాద్ సమన్వయ అధికారి డా.శారదా వెంకటేష్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మొయినాబాద్‌లోని కోడింగ్ పాఠశాలలో విద్యార్దులకు మేళుకువలు అందించడానికి, భవిష్యత్ సాంకేతికాభివృద్ది, అద్బుతమైన కంప్యూటర్ పరిజ్ఞానంతో ముడిపడి ఉన్న క్రమంలో కోడింగ్ పాఠశాల విద్యార్దులకు కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి వారికి నూతన కంప్యూటర్‌లను అందించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించిందని తెలిపారు, 100 ల్యాబ్‌టబ్‌లతో నిర్వహణ సామర్ద్యంతో కలిగిన కంప్యూటర్ ల్యాబ్‌లనుప్రారంభిం చాలని గురుకుల కార్యదర్శి రోనాల్డ్ రోస్ నిర్ణహించినట్లు తెలిపారు.

# ఎలుకలు.. పందికొక్కులు

**అపరిశుభ్రంగా గాంధీ ఆస్పత్రి**

## సిబ్బంది అజాగ్రత్త.. అవస్థలు పడుతున్న రోగుల సహాయకులు
## అస్తవ్యస్తమైన డ్రైనేజీతో సంచరిస్తున్న పందికొక్కులు, ఎలుకలు



యంత్రాలపై తిరుగుతున్న ఎలుక

**తెలంగాణ రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకంగా ఉన్న గాంధీఆస్పత్రిలో ఇప్పుడు అత్యాధునిక వైద్య సేవలను అందిస్తున్నారు. ప్రతిరోజు దాదాపు రెండువేల మందివరకు వైద్య సేవలు పొందడానికి గాంధీ ఆస్పత్రికి వస్తుంటారు. గాంధీఆస్పత్రి వైద్యులు కూడా అనేక కొత్తపద్ధతులతో ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా వైద్యం చేస్తున్నప్పటికి ఎలుకల కారణంగా అప్రతిష్ట పాలవక తప్పడం లేదు. గతంలో డ్రైనేజీ వ్యవస్థలను సమూలంగా మార్చాలనే ప్రతిపాదన ఉన్నప్పటికి అది కార్యారూపం దాల్చలేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.**



ఎలుకలు పట్టుకోడానికి ఏర్పాటు చేసిన ర్యాట్‌ప్యాడ్‌లు

సికింద్రాబాద్, అక్టోబర్ 30 ప్రభాతవార్త : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలోని సెల్లార్‌తో పాటు కొన్ని వార్డులలో ఎలుకలు వీరంగం చేస్తున్నారు. అధికారుల అప్రమత్తత, రోగుల అటెండర్‌ల నిర్లక్ష్యం కారణంగా ఎలుకలు సెల్లార్, వార్డులను ఆవాసాలుగా మార్చుకుంటున్నాయి. అపరిశుభ్రత కారణంగా చెత్తచెదారం పెరిగిపోయి ఎలుకలు చేరడానికి అవకాశాన్నిస్తున్నాయి. ఎటు చూసినా చెత్త, ప్లాస్టిక్ కవర్‌లు, మిగిలిపోయిన తినుబండారాలు ఎలుకలు పెరిగిపోవడానికి దోహదపడుతోంది. రోగుల సహాయకులు తినగా మిగిలిపోయిన ఆహారాన్ని ఎక్కడపడితే అక్కడే పెడుతుండడంతో వాటికోసం ఎలుకలు ఏకంగా వార్డులలో సంచారం చేస్తున్నాయి. వార్డులలోని బాత్‌రూమ్‌లు అపరిశుభ్రంగా ఉండడంతో పాటు సరైన విధానంలో లేకపోవడంతో ఎలుకలు, పందికొక్కులు డ్రైనేజీ పైప్‌ల ద్వారా వార్డులలోకి వస్తున్నాయి. ముఖ్యంగా సెల్లార్‌లో అపరిశుభ్రంగా ఉంటుండడంతో ఎలుకలు, పండికొక్కులు స్వైర విహారం చేస్తున్నాయి. డ్రైనేజీ పైప్‌ల ద్వారా వార్డులలోకి చేరి తినుబండారాలు, ఆహారపదార్థాల కోసం వస్తున్నాయి. రోగుల సహాయకులు ప్లాస్టిక్ కవర్‌లు, తినగా శుభ్రపర్చని టిఫిన్‌లలో మిగిలిన ఆహారంలాంటి వాటికోసం రోగులు, వారి సహాయకులు అక్కడఉండగానే వార్డులలో విహరిస్తున్నాయి.

**రాత్రివేళల్లో పండికొక్కుల స్వైరవిహారం..** పగటిపూట ఎలుకలు సెల్లార్‌లో నుంచి వార్డులలోకి ఆహార పదార్థాల కోసం వస్తుండగా రాత్రిపూట వీటి బెడద మరింత అధికంగా ఉంటోందని రోగులు చెబుతున్నారు. కొందరి నిర్లక్ష్యం కారణంగా ఎలుకలు, పందికొక్కులు వార్డులలోకి వస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. కొన్నిసార్లు రోగులు, వారి సహాయకులను నిద్రలో ఉండగా కొరుకుతున్నాయని చెబుతున్నారు. అందరు నిద్రిస్తున్న సమయంలో వార్డులలో విచ్చలవిడిగా తిరుగుతుండడంతో రోగుల సహాయకులు ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. కొన్నిసార్లు ఎలుకలు బెడ్‌లపైకి చేరు కుంటున్నాయని చెబుతున్నారు. సెల్లార్‌లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగు నీరు చేరుతుండడంతో వాటికి ఆవాసాలుగా మారుతున్నాయి. అంతే కాకుండా రోగులకు వైద్య సేవలు అందించడంలో ఎంతో కీలకంగా ఉన్న వైద్య యంత్రాలకు కూడా ఎలుకల బెడద తప్పడం లేదని తెలుస్తోంది. యంత్రాలలో అతి సున్నిత భాగాలున్న యంత్రాలకు ఎలుకల కారణంగా ముప్పుతప్పడం లేదని తెలుస్తోంది.

గతంలో కూడా ఎలుకల కారణంగా యంత్రాలకు నష్టాలు కలుగుతుండడంతో వాటిని పట్టుకోడానికి అనేక ప్రయత్నాలు చేశారు. తీగలను కొరుకడం, మల, మూత్రాలను విసర్జించడం ద్వారా యంత్రపరికాలు మరమ్మతులు చేసుకోవాల్సి వచ్చింది. కొన్నిసార్లు విద్యుత్ వైర్లను ధ్వంసం చేయడం కారణంగా ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

# కంచె చేను మేస్తే..

- **జిహెచ్‌ఎంసి విజిలెన్స్ సైలెన్స్ ఎందుకో..?**
- **ఓసీల జారీలో ఏసీపీల అంతులేని అక్రమాలు**
- **వాళ్లిద్దరూ అవినీతికి సామ్రాట్‌లు**

బాలానగర్ జోన్ ప్రతినిధి, అక్టోబరు 30 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం అక్రమ నిర్మాణాలను అరికట్టాలని ఓ వైపు ఆదేశాలు ఇస్తుంటే మరో వైపు జిహెచ్‌ఎంసి 25,26,27 కుత్బుల్లాపూర్, గాజుల రామారం, అల్వాల్ సర్కిళ్ళ పరిధిలోని పలు ప్రాంతాల్లో అడ్డూ, అదుపులేకుండా నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. కొందరు అసిస్టెంట్ సిటీ ప్లానర్లు(ఏసీపీలు) టీపీఎస్‌లు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తూ మామూళ్ళకే పరిమితం కావడంతో అనేక మంది నిర్మాణదారులతోపాటు బిల్డర్లు అనుమతులు లేకుండానే నిర్మిస్తుండడంతో గ్రేటర్‌కు రావాల్సిన కోట్లాది రూపాయలు అక్రమార్కుల జేబుల్లోకి వెళ్తున్నాయి. పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారుల్లో ఎటువంటి చలనం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటించి అక్రమ నిర్మాణాల విషయంలో దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సి ఉండగా ఈ విషయంలో దృష్టిసారించడంలేదు. అనేక ప్రాంతాల్లో జీప్లస్ టూవరకు అనుమతులు తీసుకుని ఐదారు అంతస్తులు నిర్మిస్తున్నారంటే టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏ విధంగా అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారో తెలుస్తుంది. అనుమతులు లేకపోయిన సెల్లార్లలో నిర్మాణాలు చేపట్టడం, పలు ప్రాంతాల్లో రెసిడెన్సియల్ పేరిట అనుమతులు తీసుకుంటున్న అనేక మంది బిల్డర్లు, నిర్మాణదారులు వాణిజ్య అవసరాల నిమిత్తం మడిగెలు, దుకాణాల్ని నిర్మిస్తున్నారు. పార్కింగ్‌కి కేటాయించిన సెల్లార్లలో అక్రమంగా నిర్మాణాల్ని కొనసాగిస్తున్నారు. అనుమతుల కోసం ముందుగా ప్లాన్ లో అన్నీ సక్రమంగానే ఉన్నట్లు పేర్కొని భవన నిర్మాణ అనుమతులు పొంది ఆ తర్వాత అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. కమర్షియల్ భవనాల్ని నిర్మించాలంటే కఠినమైన నిబంధనలు అమలులో ఉన్నాయి. అనేక ప్రాంతాల్లో స్థలాలకు విపరీతమైన డిమాండ్ ఉండడంతోపాటు స్థానికంగా వాణిజ్య అవసరాలు పెరుగడంతో జీ ప్లస్ టూ వరకు రెసిడెన్సియల్ అనుమతులు తీసుకుని పెద్ద పెద్ద కమర్షియల్ భవనాల్ని నిర్మిస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. నిబంధనల్లోని లొసుగులను ఆసరాగా చేసుకుంటున్న బిల్డర్లు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అ క్రమంగా నిర్మిస్తున్న కమర్షియల్ భవనాల్ని సంబంధిత అధికారులు అడ్డుకోకపోవడంతో బిల్డర్లు వాణిజ్య అవసరాలకు విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు. అనుమతి లేని భవనాలను అధికారులు గుర్తించినప్పటికీ కేవలం నోటీసులతో మమ అనిపిస్తున్నారు. ముఖ్యంగా అనుమతి లేకుండా నిర్మాణం ప్రారంభించిన దశలోనే అధికారులు గుర్తించి చర్యలు తీసుకో వాలి కాని అధికారులు, సిబ్బంది అంతగా వీటిపై దృష్టిసారించకపోవడం మూలంగానే అడ్డదిడ్డంగా బహుళంతస్తుల భవనాలు పెద్దఎత్తున వెలుస్తున్నాయి.

**వాళ్లిద్దరూ అవినీతి సామ్రాట్‌లు.. టీపీఎస్‌లు, లైసెన్స్ ప్లానర్లతో వసూళ్ళు..** అనేక ప్రాంతాల్లో పెద్దఎత్తున అక్రమ కమర్షియల్ నిర్మాణాలు సాగుతున్నా 25, 26 కుత్బుల్లాపూర్, గాజుల రామారం సర్కిళ్ళ టౌన్‌ప్లానింగ్ విభాగాల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తోన్న ఓ ఇద్దరు టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోడంలో అంతర్యమేమిటోనని పలువురు ప్రశ్నిస్తున్నారు. జేబులు నింపుకోవడానికే పరిమితమైన ఆ ఇద్దరు అధికారులు టీపీఎస్‌లు, బ్రోకర్లు, లైసెన్స్ ప్లానర్లతో వసూళ్ళకు పాల్పడుతున్నట్లు గుస గుసలు వినిపిస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే అక్రమ నిర్మాణాలు ఆ ఇద్దరు అదికారులకు కాసులు కురిపిస్తున్నాయని చెప్పవచ్చు. నివాసయోగ్యమైన భవనాల అనుమతి పొంది బిల్డర్లు, నిర్మాణదారులు వ్యాపార, వాణిజ్య సముదాయాలను నిర్మిస్తున్నారు. ఒక్కో ఫ్లోర్‌కు టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు, ఉన్నతస్థాయి అధికారుల వరకు భారీగానే వసూళ్ళకు పాల్పడుతూ అక్రమంగా కోట్లాదిరూపాయలను సంపాదిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

**విజిలెన్స్ అధికారులు సైలెన్స్ ఎందుకో..** 25,26,27 కుత్బుల్లాపూర్, గాజుల రామారం, అల్వాల్ సర్కిళ్ళలో ఓసీల జారీలో పెద్దఎత్తున ముడుపులు తీసుకుంటూ , నిబంధనలు ఉల్లంఘించిన భవనాలకు కూడా ఓసీలు జారీచేస్తూ, కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులు అనేక అక్రమాలకు పాల్పడుతున్నా విజిలెన్స్ విభాగం అధికారులు పట్టించుకోకపోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. ఏసీపీ, టీపీఎస్‌ల కార్యాలయాలు అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. భవన నిర్మాణంలో నిబంధనల్ని తుంగలో తొక్కిన భవనాలకు కూడా ఆక్యుపెన్సీ ధృవీకరణ పత్రాలు జారీచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఓ వైపు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలకు ఓసీలు జారీ అవుతుండగా మరో వైపు ఓసీలు జారి అయిన భవనాలపై అదనంగా రెండు మూడు అంతస్తులను బిల్డర్లు నిర్మిస్తున్నా ఏసీపీలు కాని టీపీఎస్‌లు అడ్డుకోకుండా తమ వంతు సహకారం అందిస్తున్నారు. అనుమతి పొందిన ప్లాన్‌కు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మించడం ఏ మాత్రం సెట్‌బ్యాక్ వదలకుండా అక్రమ నిర్మాణాలు నిర్మించడం లాంటి అక్రమాలు యధేచ్ఛగా కొనసాగుతున్నాయంటే అధికా రులు అండదండలు అక్రమ నిర్మాణాలకు ఏ రేంజ్‌లో ఉన్నాయో స్పష్టం అవుతోంది. ఇన్ని అక్రమాలు జరుగుతున్నా, అక్రమాలను వెలికితీసే విజిలెన్స్ శాఖ అధికారులు కార్యాలయాల కే పరిమితమా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విజిలెన్స్ అధికారులు దృష్టి సారించాలి.



పూజలో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్వర్‌కుమార్

# ఘనంగా మినీ మాలిక్యుల్ ఫేస్ట్



**అఫ్జల్‌గంజ్, అక్టోబర్ 30, ప్రభాతవార్త :** విద్యార్థులు చదువుతోపాటు, వివిధ రంగాలల్లో నైపుణ్యం సాధించినప్పుడే వారు కన్న కలలు సహకారం చేసుకోవడం జరుగు తుందని సీనినటుడు కమల కమల కామరాజు అన్నారు. అబిడ్స్ లిటి ల్ ఫ్లవర్ స్కూల్‌లో ప్రిన్సిపల్ రిఫరెడ్ బ్రదర్‌షాజన్ ఆంటోని ఆద్వర్యంలో మినీ మాలిక్యుల్ ఫేస్ట్ నిర్వహించడం జరిగింది. లిటిల్‌ఫ్లవర్ స్కూల్, ఆల్‌సేంట్‌హైస్కూల్, అబిడ్స్‌లిటి ల్‌ఫ్లవర్ స్కూల్‌కు చెందిన 150మంది విద్యార్థులు వివిధ రంగాలల్లో విజేత లుగా నిలిచారు. వారికి బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో బ్రదర్‌జార్జ్, బ్రదర్ జాకబ్, మైక్రోబయాలజీపోస్ట్ గ్రాడ్యుయేట్, కల్చరల్ సెక్రటరీ అనన్యరెడ్డి, హరితరెడ్డిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతికార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

# టీ20 ప్రపంచకప్ ఫీవర్

**టీ20 ప్రపంచకప్ పండుగలాంటిది. ఉరకలెత్తే ఉత్సాహం నింపే ఈ పోటీలు ప్రారంభం కావడంతో ఇదే హాట్ టాపిక్ మారింది. ఈ మ్యాచ్‌లపై పందేలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా యువత, విద్యార్థులు లక్ష్యంగా బెట్టింగ్ మాఫియాలు చెలరేగిపోతున్నాయి. బంతి బంతికీ, ఓవర్ ఓవర్‌కు, మ్యాచ్ విజేతలు ఇలా పలురకాలుగా బెట్టింగులు జరుగుతున్నాయి. క్రికెట్ బుకీల వలలో చిక్కుకుంటున్న యువకులు అప్పులు చేసి మరీ బెట్టింగులు కడుతున్నారు.**

- **మళ్లీ బెట్టింగ్ భూతం?**
- **పందేలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్న నిర్వాహకులు**
- **ప్రత్యేక నిఘా ఉంచిన పోలీసులు**



హైదరాబాద్, అక్టోబరు 30 ప్రభాతవార్త : టీ20 ప్రపంచకప్‌లో భాగంగా గ్రూప్2లో ఆదివారం 'సూపర్ 12' మ్యాచ్‌లో భారత్-దక్షిణాఫ్రికా ఆసక్తికరంగా తలపడినాయి. టాస్ గెలిచిన టీమిండియా బ్యాటింగ్ ఏంచుకుంది. భారత్ గెలిస్తే సెమీఫైనల్ బెర్త్‌ను దాదాపు ఖరారు చేసుకోవడంతోపాటు గ్రూప్‌లో టాపర్‌గా నిలిచే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నగరంలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టయింది. బెట్టింగ్ గురించి ఎవరికైనా తెలిస్తే సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఒకవైపు పోలీసులు కోరుతున్నారు. అయితే, ఈ పోటీలపై బెట్టింగ్ జరిపేందుకు కొందరు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఈజీగా డబ్బులు ఆర్జించవచ్చుననే ఉద్దేశంతో కొత్త వ్యక్తులు బుకీలుగా అవతారం ఎత్తారు. వీరికి బడా బుకీలు అండగా నిలుస్తున్నట్లు సమాచారం. ఒక్క గెలుపు తమ జీవితాలనే మార్చేస్తుందన్న ఆశతో చాలా మంది క్రికెట్ పందేల వైపు మొగ్గుచూపుతున్నారని సమాచారం. టీ20 ప్రపంచకప్ ప్రారంభానికి కొన్ని నెలల ముందునుంచే బెట్టింగ్ రాయుళ్లు బుకీలతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. మ్యాచ్‌కు ముందు, ప్రారంభమైన తర్వాత పందేలు కాయడంపై బుకీలు పక్కా ప్రణాళికతో తమతో చట్‌లో ఉంటారని కొందరు చెబుతున్నారు. ఇదిలా ఉండగా బుకీలందరూ ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు వెళ్లినట్లు సమాచారం. ఈ క్రమంలో బుకీలు మళ్లీ భారీ స్థాయిలో క్రికెట్ బెట్టింగ్ కార్యకలాపాలు సాగించేందుకు యత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసుల నిఘా ఎక్కువగా ఉండటంతో నగరంలో కాకుండా.. శివారు ప్రాంతాల్లో అడ్డాలను ఏర్పాటు చేసుకున్నారని సమా చారం. బెట్టింగ్‌లు కాసేవారికి రహస్యఫోన్ నంబర్లతో పాటు కోడ్ భాషను ఉపయోగిస్తున్నారు. బెట్టింగ్‌కు పాల్పడే వ్యక్తి ముందుగానే రూ.50వేల డిపాజిట్ చేసేలా నిబంధన పెట్టారు. అలా డిపాజిట్ చేసిన వ్యక్తికి కోడ్‌తో పాటు నిర్వాహకుల సీక్రెట్ మొబైల్ నంబర్ ఇస్తారు. పొరపాటున ఇతరుల నుంచి కాల్ వచ్చినా, కోడ్ భాషతో బెట్టింగ్‌లు నిర్వహిస్తున్న అంశం బహిర్గతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

బెట్టింగ్ నిర్వాహకుడి అడ్డా వద్దకు ఎవరూ రాకూడదనే నిబంధనతో పాటు ఒప్పందం ప్రకారం ఇచ్చిన మొబైల్ ఫోన్‌కు మాత్రమే ఫోన్ చేయాలనే నిబంధనలతో బెట్టింగ్ నిర్వహిస్తారు. ఈ ప్రపంచకప్ పోటీలో జరిగే ప్రతి మ్యాచ్‌లో బంతి బంతికి, ఓవర్‌కు ఫలానా జట్టు గెలుస్తుందని, ఓవర్‌లో వికెట్ పడుతుందని ప్రతి అంశంపై బెట్టింగ్ కాస్తారు. టీవి చూస్తూనే బంతి బంతికి కాచే బెట్టింగ్‌కు ఒకటికి పది రెట్లు పందెం కాస్తారు. రసవత్తరంగా సాగే మ్యాచులు, పోటా పోటీగా కొనసాగే మ్యాచ్‌లో ఒకటికి 15 రెట్లు బెట్టింగ్ కాస్తారు. అయితే, ఈ బెట్టింగ్‌లో కాచి పెద్ద మొత్తంలో సొమ్ము పోగొట్టుకున్న వారే అధికంగా ఉన్నారు. అయినా కొందరు యువకులు, వ్యాపారులు మాత్రం పందెం కాచేందుకు వెనుకాడటం లేదు. అయితే క్రికెట్ బెట్టింగ్‌ను నగరం నుంచి తరిమికొట్టే దిశగా పోలీసు యంత్రాంగం చూపిస్తున్న నిఘా మరింత పెంచాలని పలువురు కోరుతున్నారు.

## ఆర్టీసి బస్సు ఢీకొని విశ్రాంత ఇంటెలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ దుర్మరణం



మృతి చెందిన కనకరాజు

సంజీవరెడ్డినగర్, అక్టోబర్ 30 ప్రభాతవార్త : అమీర్‌పేటకు చెందిన విశ్రాంత ఇంటెలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ కనకరాజు (63)ను ఆర్టీసి బస్సు ఢీకొని మృతి చెందిన సంఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ కనకరాజు ఇంటెలిజెన్స్‌లో పని చేస్తున్నాడు. కాగ ఆదివారం అమీర్‌పేటలోని కనకదుర్గమ్మ దేవాలయం వద్ద ఆర్టీసి బస్సు ఢీ కొని అక్కడిక్కడే మృతి చెందాడని తెలిపారు. ఈ మేరకు పంజాగుట్ట పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పంజాగుట్ట ఇన్స్‌పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి తెలిపారు.

## ఒయూలో పాము కాటుతో వ్యక్తి మృతి



మృతి చెందిన దోతి అంజయ్య (ఫైల్)

తార్నాక, అక్టోబర్ 30 ప్రభాతవార్త: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వీసీ లాడ్జ సమీపంలో ఉండే క్యాంపులో దోతి అంజయ్య (50)పాముకాటుతో మృతి చెందాడు. ఈ ప్రాంతంలో విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యుత్‌ను ఒయూ అధికారులు నిలిపివేశారని దీంతో చీకటిలో ఉంటున్న అంజయ్య ఇంటిలోకి వెళ్లిన పాము కాటు వేయడంతోనే మృతి చెందాడని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. పాము కాటుకు గురైన అంజయ్యను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకు వెళ్లుతుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. కాగా గతంలో కూడా లేడీస్ హాస్టల్‌ల్లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్న ఓ మహిళ, క్యాంపులో ఉండే మరో జిమ్ కోచ్‌కూడా పాము కాటుతోనే మృతి చెందాడు. దీంతో పాముల బెడదతో ఈ ప్రాంతంలో ఉండే వారు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారని స్థానిక నాయకులు ఖాజా, జై భీం సేనా వ్యవస్థాపక అధ్యక్షులు పి. బల్‌వంత్‌రావు పేర్కొన్నారు. కమర్షియల్ మీటర్లను ఓ.యూ అధికారులు ఫిట్ చేయడంతో వేలాదిగా బిల్లులు వస్తున్నాయని తాము చెల్లించలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



## అన్నిరంగాల అభ్యున్నతికి ఉపాధ్యాయులే వెన్నుముక

**- మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ డా. ఏనుగు నరసింహారెడ్డి**

**నాంపల్లి, అక్టోబరు 30, ప్రభాతవార్త :** ఏరంగమైనా, రంగంలోనైనా గొప్పగా రాణించాలంటే ముందుగా కావాల్సింది విద్యనేనని, ఆ విద్యను సక్రమంగా బోధించే ఉపాధ్యాయులే అన్నిరంగాల అభ్యున్నతికి వెన్నుము కవంటి వారని మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్, తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ తొలి కార్యదర్శి, ప్రముఖకవి డా. ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ, విద్యాబోధనలుచేస్తూ వారి వికాసం, సర్వతోముఖాభివృద్ధికి విశేష కృషిచేస్తు న్న పలువురు ఉపాధ్యాయులకు అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సావిత్రిబాయిపూలే సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ అధ్యాపక పురస్కారాలను ప్రదానం చేశారు. బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. ఏనుగు నరసింహారెడ్డి విశిష్ట అతిథులు మాతృభాష చైతన్య సమితి అధ్యక్షుడు బడేసాబ్, సరస్వతీ ఉపాసకుడు, ప్రముఖ సంఖ్యాశాస్త్రవేత్త దైవజ్ఞశర్మ తదితర ప్రముఖుల చేతులమీదుగా మొయినాబాద్ వికాస్ ఉపాధ్యాయ శిక్షణా కళాశాలలో మనోవిజ్ఞానశాస్త్ర అధ్యాపకుడుగా పనిచేస్తున్న పాలమూరు శ్రీనివాసులును శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను, ఉత్తమ అధ్యాపక పురస్కా రాన్ని ప్రదానంచేసి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వికాస్ కళాశాల కర స్పాండెంట్ రాజేంద్రప్రసాద్, ప్రధానాచార్యులు రవి, అధ్యాపక బృందం అవార్డు స్వీకర్త శ్రీని వాసులుకు అభి నందనలు తెలిపారు.

## చిలుకలగూడ గ్యాస్ సిలిండర్ బాధితులకు రూ. 25లక్షల ఆర్థిక సాయం

**అందజేసిన డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్**



బాదిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

మెట్టుగూడ, అక్టోబర్ 30 ప్రభాతవార్త: మెట్టుగూడ డివిజన్ పరిధిలోని చిలుకలగూడ గ్యాస్ సిలిండర్ పేలిన ఘటన బాధితులకు రూ. 25లక్షల ఆర్థిక సహాయాన్ని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అందజేశారు. ఆసుపత్రికి, బాదిత కుటుంబ సభ్యుల ఇళ్లవద్దకు పద్మారావుగౌడ్ స్వయంగా వెళ్లి సాయం అందజేశారు. తొలుత దూద్ బావికి చేరుకొని ఘటనలో తీవ్రం గా గాయపడి మృతి చెందిన నారాయణ స్వామి కుటుంబాన్ని పరామర్శించి ఆయన బార్య పద్మావతికి రూ. 5లక్షలను అందజేశారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని వారికి బరోసాను ఇచ్చారు. అనంతరం యశోధా ఆసుపత్రికి చేరుకున్న పద్మారావు అందులో చికిత్స పొందుతున్న బాదితులకు సీఎం రిలీఫ్ ద్వార మంజూరైన రూ. 20లక్షల మంజూరు పత్రాలను అందించారు. చికిత్సపొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారిని అధైర్యపడవద్దని వారికి ధైర్యాన్ని అందించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుంటుందన్నారు. పేదల ప్రయోజనాలను తప్పనిసరిగా పరిరక్షిస్తుందన్నారు. బాదితులను ఆదుకునేందుకు తక్షణమే సహకరించిన పద్మారావుగౌడ్‌కు కార్పోరేటర్ రాసూరి సునిత కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెరాస యువ నాయకులు కిశోర్ గౌడ్, కిరణ్‌గౌడ్, రామేశ్వర్‌గౌడ్, చిలుకలగూడ ఇన్స్‌పెక్టర్ నరేష్‌తధితరులు పాల్గొన్నారు.